1
నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
ఆదివారం | సెప్టెంబర్ 24, 2023 | www.navatelangana.com

ట్రాక్టర్‌పై అడిషనల్ కలెక్టర్

ఆదిలాబాద్ రూరల్: ఆదిలాబాద్ గ్రామీణ మండలంలో రోడ్డు సౌకర్యం గురించి తెలుసుకోవడానికి జిల్లా స్థాయి అధికారి ట్రాక్టర్‌పై పర్యటించారు. నర్సరీలకు వెళ్లడానికి దారులు లేకపోవడంతో శనివారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదిలాబాద్ రూరల్ మండలంలో ట్రాక్టర్‌పై వెళ్లారు. గ్రామపంచాయతీ పరిధిలోని నర్సరీ, సంపద వనం, పల్లె ప్రకృతి వనాల్లో పెంచుతున్న మొక్కలను పరిశీలించి పెంచుతున్న విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. చెట్ల మధ్యలో పిచ్చిమొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. గ్రామానికి వచ్చిన అదనపు కలెక్టర్‌ను సర్పంచ్ దారట్ల భాస్కర్ శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీకాంత్, ఎంపీఓ ఆనంద్ కుమార్, ఏపీఓ, ఈసీ, టీఏ, పంచాయతీ కార్యదర్శి, ఎఫ్ఏ గ్రామస్తులు పాల్గొన్నారు.



అదృశ్యమైన యువకుని మృతదేహం లభ్యం

నవతెలంగాణ-ఖానాపూర్

అదృశ్యమైన యువకుని మృతదేహం లభ్యమైన ఘటన మండలంలో కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని సుర్జాపూర్ గ్రామానికి చెందిన గంగే యోగేష్(28) ఈ నెల 15న బయటకెళ్లి తిరిగి రాలేదు. దీంతో 16న ఈ విషయమై తండ్రి సాంబయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు వెతుకుతున్న సమయంలో శనివారం బాదన్‌కుర్తి సమీపంలోని గోదావరిలో చేపలు కోసం వెళ్లిన మత్స్యకారులకు మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై లింబాద్రి అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని బయటకు తీయించి తండ్రి సాంబయ్యకు సమాచారం అందించారు. మృతదేహం యోగేష్‌దేనని ఆయన గుర్తుపడ్డారు. మృతుడు కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడని, జీవితంపై విరక్తి చెంది గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై తెలిపారు.

తాగు నీటి సమస్య పరిష్కరించాలి



నవతెలంగాణ-జైపూర్

గ్రామంలో నెలకొన్న తాగు నీటి సమస్యను పరిష్కరించాలని నర్వ గ్రామస్తులు కోరుతున్నారు. ఊరు మొత్తానికి ఒకే బోరు మోటార్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నందున ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని వాపోతున్నారు. సమీపంలో గల వాగు ఒడ్డున ఏర్పాటు చేసిన బోరు ద్వారా సరఫరా చేస్తున్నా మోటార్ తక్కువ కెపాసిటితో ఉండటంతో నీటి సరఫరాకు ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదనపు బోర్లు వేయకపోయినా ప్రస్తుతం పంపింగ్ చేస్తున్న మోటార్ స్థానంలో హైకెపాసిటీ మోటార్ ఏర్పాటు చేస్తే కొంత మెరుగ్గా ఉంటుందని పేర్కొంటున్నారు. తాగు నీటి ఇబ్బందులు పరిష్కరించాలని ఎంపీడీఓతో పాటు సంబంధిత శాఖ అధికారులను కోరినా ఫలితం లేకుండా పోయిందంటున్నారు. హై కెపాసిటీ మోటార్ ఏర్పాటు చేయడంతో పాటు వార్డు ప్రజలకు అనుకూలమైన సమయంలో నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంలో అధికారులు స్పందించకుంటే కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని సామాజిక కార్యకర్త పొట్టాల నాగరాజుతో పాటు గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి



నవతెలంగాణ-నార్నూర్

మండల అభివృద్ధికి మంజూరైన పనులను సకాలంలో నాణ్యతతో పూర్తి చేయాలని జడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కనక మోతుబాయి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో పాల్గొన్న ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. అంతకు ముందు ఆయా శాఖల అధికారులు వారి ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. సభ్యులు పలు సమస్యలు లెవనెత్తగా వాటి పరిష్కరం చర్యలు తీసుకోవాలని జడ్పీ చైర్మెన్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన సమస్యలను పరిష్కరించేల ప్రణాళికలు చేయాలన్నారు. వర్షా కాలం నేపథ్యంలో గ్రామాల్లో వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలనీ, వైద్యశిబిరం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

న్యాక్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్) ఆధ్వర్యంలో లేబర్ కార్డ్ ఉన్న వారికి శనివారం మందమర్రి పట్టణంలోని భవన నిర్మాణ కార్యాలయంలో ఉచిత శిక్షణ తరగతులను సీనియర్ ట్రైనీ అధికారి స్వప్నరాణి, ట్రైనీ అధికారి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రైనీ అధికారులు మాట్లాడుతూ శిక్షణలో ఎలక్ట్రానిక్, తాపి, పెయింటింగ్‌లలో శిక్షణ ఇస్తామన్నారు. 15రోజుల పాటు శిక్షణ ఉంటుందని, మధ్యాహ్న భోజనంతో పాటు రోజు రూ.300 చొప్పున కార్మిక శాఖ ఆధ్వర్యంలో కార్మికుల ఖాతాలో జమ చేస్తారని తెలిపారు. శిక్షణ పొందిన వారికి న్యాక్ సంస్థ ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తామని తెలిపారు. శిక్షణ పొందేవారికి న్యాక్ నుండి టిషర్ట్స్, నోట్ బుక్, పెన్నులు అందజేశారు.

ఊరేగింపుల్లో డీజేలకు అనుమతి లేదు



నవతెలంగాణ-జైపూర్

వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విగ్రహాల నిమజ్జనంలో డీజేలకు అనుమతి లేదని శ్రీరాంపూర్ సీఐ రమేష్ బాబు తెలిపారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై ఉపేందర్‌రావుతో కలిసి మండల పరిధి డీజే నిర్వాహకులతో మాట్లాడారు. నవరాత్రులు భక్తి శ్రద్ధలతో పూజించిన గణపతి విగ్రహాలను అదే తీరున భజన కార్యక్రమాలతో ఊరేగించి నిమజ్జనం చేయాలని అన్నారు. నిబంధనలను అతిక్రమించి డీజేలు వినియోగించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు డీజే నిర్వాహకులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

ఆ జాబితాలో పేరెవరిదీ..?

- హస్తం టికెట్లపై సర్వత్రా ఉత్కంఠ
- ఎవరిని వరిస్తుందోనని ఆశావహుల్లో ఆందోళన
- అధిష్టానం పెద్దల ప్రసన్నం కోసం ప్రయత్నాలు
- ఈ నెలాఖరులో అభ్యర్థుల వెల్లడికి అవకాశం
- కాంగ్రెస్‌లో ఉత్కంఠ రేపుతున్న పరిణామాలు

కాంగ్రెస్‌లో టికెట్ల పర్వంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే అధికార పార్టీ అభ్యర్థుల జాబితా వెల్లడికావడంతో ప్రధాన ప్రతిపక్షమైన హస్తం పార్టీ నుంచి పోటీదారులు ఎవరోననే చర్చ జరుగుతోంది. దీంతో కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ అభ్యర్థుల జాబితాను సిద్ధం చేసిందనే ప్రచారం జరగడంతో ఉమ్మడి జిల్లా ఆశావహుల్లో ఉత్కంఠ రేకెత్తిస్తోంది. తాజా జాబితాలో ఎవరి పేరు ఉందోనని ఆరా తీస్తున్నారు. తొలి జాబితాలో 80మంది పేర్లతో కూడిన జాబితాను రూపొందించిన కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ ఈ జాబితాను పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీకి పంపించనుందని సమాచారం. అభ్యర్థుల బలాబలాలు..సామాజిక వర్గాల సమీకరణాలను పరిగణనలోకి తీసుకొని ఎంపిక ఉంటుందని తెలుస్తోంది. ఈ జాబితాను నెలాఖరులోగా..లేదంటే అక్టోబర్ మొదటి వారంలో విడుదల చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. మరోపక్క టికెట్ దక్కించుకునేందుకు ఆశావహులు ఎవరికి వారు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు ఢిల్లీలోనే మకాం వేసి అధిష్టానం పెద్దలను ప్రసన్నం చేసుకుంటూ టికెట్‌పై భరోసా తీసుకుంటున్నారని తెలుస్తోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్‌లో టికెట్ల అంశం చివరి అంకానికి చేరుకుంది. రాష్ట్రంలో అధికార బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించడంతో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ కూడా టికెట్ల అంశాన్ని తేల్చేందుకు సిద్ధమైంది. ఇప్పటికే ఢిల్లీలో కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ సమావేశమై అభ్యర్థుల ఎంపికను పూర్తి చేసినట్లు తెలుస్తోంది. దాదాపు 80స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేయగా.. ఇందులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎన్ని స్థానాలకు అభ్యర్థుల ఎంపిక పూర్తిచేశారోననే సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది. ఉమ్మడి జిల్లాలో పది స్థానాలు ఉండగా ఏకంగా 54మంది ఆశావహులు దరఖాస్తులు చేసుకున్నారు. మంచిర్యాల, నిర్మల్ మినహా మిగితా ఎనిమిది నియోజకవర్గాలకు 3 నుంచి 11వరకు దరఖాస్తులు వెళ్లాయి. ఆశావహులు అధిక సంఖ్యలో ఉండటంతో టికెట్ ఎవరిని వరిస్తుందోననే చర్చకు కొనసాగుతోంది. మంచిర్యాల, నిర్మల్ నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఖరారు దాదాపు పూర్తయినట్లు తెలుస్తోంది.ఈ నియోజకవర్గాల అభ్యర్థుల పేర్లు తొలి జాబితాలోనే ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. మరోపక్క మిగిలిన స్థానాల్లోనూ పూర్తిస్థాయిలో కాకుండా దాదాపు పోటీ చేసే అభ్యర్థుల పేర్లు ఓ కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. కానీ ఇప్పుడే ప్రకటిస్తే అసమ్మతి స్వరాలు పెరిగే అవకాశం ఉండటంతో అధిష్టానం ఆచితూచి అడుగులు వేస్తోందని సమాచారం.

ఢిల్లీ పరిణామాలపై ఆశావహుల ఆరా..!

టికెట్ల పర్వం దాదాపు కొలిక్కిరావడంతో ఆశావహుల్లో ఆందోళన మొదలైంది. ప్రస్తుతం పార్టీలో రెండేసి గ్రూపులు ఉండటం.. ఎవరికి వారు టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తుండటం వంటి పరిణామాలు తీవ్ర ఉత్కంఠకు దారి తీస్తున్నాయి. ఒక గ్రూపునకు చెందిన అభ్యర్థికి టికెట్ వస్తే మరో గ్రూపునకు చెందిన వారు సహకరిస్తారా లేదా అనేది చర్చనీయాంశంగా మారుతోంది. కొందరు కాంగ్రెస్ పార్టీలో ఏండ్ల నుంచి ఉంటూ టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తుండగా.. మరికొందరు ఇటీవల పార్టీలో చేరి టికెట్లు ఆశిస్తున్న వారు కూడా ఉన్నారు. ఆదిలాబాద్‌లో ఏకంగా ఎనిమిది మంది టికెట్ కోసం దరఖాస్తు చేయగా.. ఇందులో నలుగురు అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. బోథ్‌లో ఏకంగా 11మంది అభ్యర్థులు టికెట్ ఆశిస్తున్నారు. ఖానాపూర్‌లో ఆరుగురు ఆశావహులు దరఖాస్తులు చేయగా.. ఇక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖానాయక్ కూడా కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఈమె భర్త శ్యాంనాయక్ కూడా హస్తం పార్టీ తరపున ఆసిఫాబాద్ నుంచి పోటీ చేయాలని భావిస్తున్నారు.ఈ క్రమంలో రెండు టికెట్లు అడుగుతున్నట్లు తెలుస్తోంది. మరోపక్క టికెట్ దక్కించుకునేందుకు ఆశావహులు ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొడుతున్నట్లు తెలుస్తోంది. కొందరు ఆశావహులు కొన్ని రోజుల పాటు అక్కడే మకాం వేసి టికెట్ దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరికొందరు ఆశావహులు తాజా జాబితాలో ఎవరి పేర్లు ఉన్నాయి..ఎవరికి రాలేదోనని తెలిసిన వారి ద్వారా ఆరా తీస్తున్నారు. అధిష్టానం ఎవరిని కరుణిస్తుందో..ఎవరికి మొండిచేయి చూపిస్తుందో ఈ నెలాఖరులోగా తేలిపోనుందని తెలుస్తోంది.



ఆసిఫాబాద్‌లో భారీ వర్షం

- పిడుగుపాటుతో ఇద్దరు మృతి
- వట్టివాగు, కుమురంభీం గేట్లు ఎత్తివేత

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో శనివారం కురిసిన భారీ వర్షంతో జిల్లా తడిసి ముద్దయింది. జిల్లా వ్యాప్తంగా వాగులు, వంకలు పొంగిపొర్లాయి. అడ, వట్టి వాగు ప్రాజెక్టుకు సంబంధించిన రెండేసి గేట్లు ఎత్తి నీటిని కిందికి వదులుతున్నారు. మండలంలో పొలం పనులకు వెళ్లిన ఇద్దరిపై పిడుగు పడి మృతి చెందారు. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు వచ్చి భారీ వర్షం పడడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది.

పిడుగుపాటుకు ఇద్దరు మృతి

భారీ వర్షంతో పిడుగులు పడిన ఘటనలో వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మృతి చెందారు. మండలంలోని హీరాపూర్ గ్రామంలో బోయిరే విట్టు తన పొలంలో యూరియా వేసేందుకు కుటుంబ సమేతంగా వెళ్లాడు. యూరియా వేస్తున్న క్రమంలో అకస్మాత్తుగా పిడుగు పడడంతో భార్య బోయిరే మీనా అక్కడికక్కడే చనిపోయింది. ఆమె తల్లి లక్ష్మి దగ్గర్లో ఉండడంతో కొద్దిపాటి గాయాలతో బయటపడింది. కొడుకు బందుకు ఎటువంటి



గాయాలు కాలేదు. తల్లి లక్ష్మి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. చిర్రకుంట గ్రామ పంచాయతీ పరిధిలోని గుట్టచెల్మ గ్రామంలో పొలం దున్నుతున్న దేవ్‌రావు



పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసిఫాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తెలంగాణ ఇచ్చిన దేవత సోనియాగాంధీ : కంది

- కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ హామీల పోస్టర్ల ఆవిష్కరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ ఇచ్చిన దేవత సోనియాగాంధీ అని, ఆమె త్యాగానికి ప్రతిరూపామని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని తుక్కుగూడ సభలో ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ హామీలను ప్రజల్లోకి తీసుకెళ్తామని, తెలంగాణలో కాంగ్రెస్ జెండాను ఎగరేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలోని ప్రజాసేవా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ 6 గ్యారంటీల కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతీ గడపకు పార్టీ గ్యారంటీ హామీలను చేరవేయడానికి కార్యకర్తలందరు కృషి చేస్తారన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా వెబ్‌సైట్ ప్రారంభమైందన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహాలక్ష్మీ పథకం కింద ప్రతీ మహిళకు నెలకు రూ.2500, ఐదు వందలకే గ్యాస్ సిలెండర్ అందజేస్తామన్నారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణంతో పాటు రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని, సాగు పెట్టుబడి సహాయం కౌలు రైతులకు అందిస్తామన్నారు. వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ. 12 వేల రూపాయలు, గృహజ్యోతి పథకం కింద ప్రతి ఇంటికి నెలకు 200 యూనిట్ల ఉచిత కరెంట్, ఇందిరమ్మ ఇల్లు పథకాన్ని అమలు చేస్తామని వెల్లడించారు. యువ వికాసం కింద ప్రతీ విద్యార్థికి ఉచితంగా రూ.5 లక్షల విద్యా కార్డు, చేయూత పథకం కింద అవ్వ-తాతకు నెలకు రూ. 4వేలు, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ. 5 లక్షల వరకూ ఉచిత వైద్య సౌకర్యం కల్పిస్తామన్నారు. గ్యారంటీ కార్డుపై టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి, సీఎల్పీ లీడర్ మల్లు భట్టివిక్రమార్క సంతకం ఉంటుందని తెలియజేశారు. విద్వేశాన్ని నిర్మూలించి, దేశాన్ని ఐక్యం చేసేందుకు కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు 4 వేల కి.మీటర్లకుపైగా భారత్ జోడో యాత్ర సాగిందన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిగా చూడటమే తన లక్ష్యమన్నారు. దేశ చరిత్రలో భారత్ జోడో యాత్ర ఎంతో ప్రత్యేకమైందని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఐనేని సంతోష్ రావు, నాగర్కర్ శంకర్, షకీల్, సుజాత్ అలీ, కొండూరి రవి, అల్లూరి అశోక్ రెడ్డి నాయకులున్నారు.

బీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్

నవతెలంగాణ-బోథ్

బీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శిగా మండలంలోని సోనాల గ్రామానికి చెందిన భగత్ ప్రవీణ్‌ను ఎన్నుకున్నట్టు బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు చిలుముల పంచాక్షరి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీని గ్రామాల్లో బలోపేతం చేయడంలో భాగస్వామ్యమై అందిస్తున్న సేవలకుగాను ప్రధాన కార్యదర్శిగా నియమించడం జరిగిందన్నారు. కష్టపడి పని చేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు.

బోథ్ బంద్ విజయవంతం



నవతెలంగాణ-బోథ్

బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ప్రటించాలనే డిమాండ్‌తో శనివారం చేపట్టిన బంద్ విజయవంతం అయింది. బంద్‌కు వాణిజ్య, వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా సహకరించాయి. ఉదయం నుంచే దుకాణాలు తెరుకోలేదు. రెవెన్యూ డివిజన్‌గా మార్చే వరకు తమ పోరాటు కొనసాగుతాయని సాధన కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే మండల కేంద్రంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 70వ రోజుకు చేరుకున్నాయి. రెండు నెలలకు పైగా నిరసనలు తెలుపుతున్న పట్టించుకోవడం లేదని సాధన సమితి మండిపడుతున్నారు. ఈ క్రమంలోనే మండల బంద్‌కు పిలుపు నిచ్చారు. అన్ని వర్గాలు సహకరించడంతో బంద్ విజయవంతం అయింది. బోథ్‌లోని ఆస్తిత్వం, ఆత్మ గౌరవాన్ని కాపాడుకునే దిశగా ప్రజలు మమేకమై పోరాడుతున్నారని తెలిపారు. ప్రజలు ఉద్యమిస్తుంటే నాయకులు స్పందించడ పోవడం సిగ్గు చేటన్నారు. ఈ నెల 25న మంత్రి కేటీఆర్ నిర్మల్ సభలో రెవెన్యూ డివిజన్ ప్రకటించాలని, లేనిపక్షంలో ప్రజల నుండి పెద్ద ఎత్తున ప్లకార్డు ప్రదర్శన నిరసనలు చేపడుతామని హెచ్చరించారు. అదే విధంగా ఆదివారం నిర్వహించే రాస్తారోకోలో మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వేతనాల పెంపు నిరసన దీక్షను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

కాంట్రాక్టు కార్మికుల వేతనాల పెంపు కోసం జరిగే నిరసన దీక్షను జయప్రదం చేయాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం(సీఐటీయూ)రాష్ట్ర అధ్యక్షులు దూలం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని స్థానిక సివిక్ కార్మికుల కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో గంధం రవి అధ్యక్షతన గేట్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దూలం శ్రీనివాస్ మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న వివిధ విభాగాల కాంట్రాక్టు కార్మికులు గతేడాది సెప్టెంబరులో జరిగిన సమ్మెలో యాజమాన్యం దిగివచ్చి 12డిమాండ్లను ఒప్పుకొని అగ్రిమెంట్ చేసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. అగ్రిమెంట్ చేసి సంవత్సరం కాబోతున్నా 20శాతం బోనస్, కుటుంబ సభ్యులందరికి వైద్య సదుపాయం, పని ఆధారంగా వేతనాలు, పండగ ఆర్జిత సెలవులు తదితర డిమాండ్లను ఇప్పటి వరకు అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం 22ను 2021 జూన్‌లో విడుదల చేసినా గెజిట్ చేయకుండా కార్మికుల పట్ల నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని అన్నారు. అగ్రిమెంట్‌లోని మిగిలిన అంశాలను అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవోను గెజిట్ చేసి కాంట్రాక్టు కార్మికుల వేతనాలను పెంచాలని ఈ నెల 27న గోదావరిఖనిలో జీఎం కార్యాలయం ఎదుట చేపట్టే దీక్షలో బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్ డివిజన్‌లోని కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మికులు అనిత, శారద, లక్ష్మి, సంపత్, కుమార్, అరుణ్ పాల్గొన్నారు.

కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు(టి) నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు శనివారం హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. స్థానిక ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం కాగజ్‌నగర్ నుండి బయల్దేరిన నాయకులు శనివారం ఉదయం పార్టీ కండువా కప్పుకున్నారు. పార్టీలో చేరిన వారిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కాగజ్‌నగర్ మాజీ మున్సిపల్ ఛైర్మన్ దస్తగిరి, పట్టణానికి చెందిన సీనియర్ నాయకులు నజీబ్, మాజీ కౌన్సిలర్ ఎం శ్రీరాంగౌడ్, యూసుఫ్, సల్మాన్ ఉన్నారు. అదేవిధంగా దహెగాం మండలానికి చెందిన బీజేపీ నాయకులు రాంటెంకి సురేష్, పెంచికల్‌పేట్ మండలం ఎల్లూరు గ్రామ బీజేపీ నాయకుడు కాటెల భీమయ్య, చింతలమానెపల్లి మండలం ఖర్జల్లి మాజీ ఉప సర్పంచ్ చౌదరి కేదారి, నాయకుడు దందెర దామోదర్ పెంచికల్‌పేట్ మండలం కొండపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు కుబిడె రాకేష్ ఉన్నారు.

26న నెట్ బాల్, హాకీ, చెస్ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 26న జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో అండర్ 17, అండర్ 14 బాల బాలికల నెట్ బాల్, హాకీ, చెస్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా పాఠశాలల క్రీడల ప్రధాన కార్యదర్శి సాంబశివరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల బాల బాలికలు పాల్గొనవచ్చున్నారు. ఇతర వివరాలకు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు తిరుపతి 9949300668 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నవతెలంగాణ-నార్నూర్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ రాంబాబు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని విజయ్‌నగర్ కాలనీలో వైద్య శిబిరం నిర్వహించారు. ఒకరికి డెంగీ పాజిటివ్ వచ్చినట్లు పేర్కొన్నారు. వార్డులో వైద్యసిబ్బంది పరిసరాల పరిశుభ్రత, యాంటీ లార్వా ఆపరేషన్, మురికి కాలువలు పరిశుభ్రంగా ఉండేవిధంగా అవగాహన కల్పించారు. వాడలో డెంగ్యూ, మలేరియా



పరీక్షలు నిర్వహించి, జ్వరం జలుబు ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. వర్షాకాల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్య శిబిరంలో స్థానిక సర్పంచ్ ఆడే గజానంద్, హెచ్ఈఓ నాందేవ్, హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్, వైద్యసిబ్బంది ఈశ్వర్, గోకుల్, కార్యదర్శి దినేష్, ఆశాలు జ్యోతి, లక్ష్మి ఉన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని అదనపు కలెక్టర్ శ్యామలదేవి అన్నారు. శనివారం ఆదిలాబాద్‌లోని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ బాలికల పాఠశాలల ఆటల పోటీలు శనివారం ముగిశాయి. ఉమ్మడి జిల్లాలోని 11 పాఠశాలలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అదనపు కలెక్టర్ హాజరై మాట్లాడారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. బీసీ శాఖ అధికారి రాజలింగు, ఆర్సీఓ గోపీచంద్, ప్రిన్సిపల్ విద్య ఉన్నారు.



నిర్మల్ మున్సిపాలిటీకి రూ.50 కోట్ల నిధులు మంజూరు

- సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం
- కృతజ్ఞతలు తెలిపిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం రూ.50కోట్ల నిధులను కేటాయించిందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. నిర్మల్ పట్టణాభివృద్ధికి రూ.50 కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. శనివారం నిర్మల్ మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో బీఆర్ఎస్ శ్రేణులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి ఐకేరెడ్డి, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ అడిగిన వెంటనే నిర్మల్ పట్టణాభివృద్ధికి నిధులను మంజూరు చేశారని అన్నారు. సమగ్ర ప్రణాళికతో నిధులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ నిధులతో ప్రజలకు కనీస మౌలిక వసతులను కల్పించడంతో పాటు, పట్టణాన్ని సర్వాంగా సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రతి వార్డుకు సీసీ రోడ్డు, డ్రైన్లు, కమ్యూనిటీ హాళ్లు, పార్కులు, ఏర్పాటు చేస్తామన్నారు. సీఎం కేసీఆర్ రాజీపడకుండా విడుదల చేసిన నిధులతో అభివృద్ధిని కొత్త పుంతలు తొక్కిస్తామని వెల్లడించారు. ఈ నిధులతో రూ.9.80 కోట్లతో 42 వార్డుల్లో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు, రూ. 5 కోట్లతో నూతన పురపాలక భవన నిర్మాణం, రూ.4కోట్లతో ఎన్టీఆర్ స్టేడియంలో ఇండోర్ స్టేడియం, మల్టిపర్పస్ హాల్, రూ.2 కోట్లతో ధర్మసాగర్ చెరువు వద్ద మురుగు నీటి శుద్ధీకరణ, రూ.3 కోట్లతో ధర్మసాగర్ మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధి, రూ. 1.50 కోట్లతో బండ్ వైడెనింగ్ (కట్ట విస్తరణ). రూ.2 కోట్లతో ఇబ్రహీం చెరువు బండ్ వైడనింగ్ (కట్ట విస్తరణ), రూ.2.50 కోట్లతో పాత తహసీల్దార్ కార్యాలయం వెనుక పార్క్ అభివృద్ధి, ఇతర చెరువుల అభివృద్ధికి కేటాయిస్తామని అన్నారు. టెండర్లు పూర్తి కాగానే పనులను వేగంగా చేయించి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. అనంతరం నిధుల మంజూరుకు ప్రత్యేక చొరవ చూపిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, కౌన్సిలర్లు, అధికారులు సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు.



పరిసరాల పరి శుభ్రతతో రోగాలు దూరం



నవతెలంగాణ-తాంసి

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో రోగాలు మన దరికి రాకుండా ఉంటాయని పీహెచ్‌సీ వైద్యురాలు శ్రావ్య అన్నారు. శనివారం మండలంలోని పొన్నారి, జామిడి గ్రామాలలో గ్రామ సర్పంచ్ లు ఆరోగ్య సిబ్బంది కలిసి హెల్త్ క్యాంపు నిర్వహించి, గ్రామంలోని ఇంటి పరిసరాలను పరిశీలించారు. వర్షపు నీరు నిల్వలను తొలగించారు. అనంతరం హెల్త్ క్యాంపులో రోగులను పరీక్షించి మందులను ఇచ్చి వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని అన్నారు. జ్వరంతో పటు ఎలాంటి అనారోగ్యాల బారిన పడిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేసుకొని మందులు వాడాలని సూచించారు. బోర్వెల్ నీళ్ల తాగడం వల్ల చలి జ్వరాలు వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. మన ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల రక్త నమూనాలు సేకరించి, జిల్లా కేంద్రంలోని టిహాబ్‌లో పరీక్షలు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అశోక్, మండల ఆరోగ్య విస్తీర్ణాధికారి పర్యవేక్షకులు తులసి రామ్, సూపర్‌వైజర్ నాగేశ్వర్, ఏఎన్ఎం లక్ష్మి, ఆశా కార్యకర్తలు జ్యోతి, వెంకటమ్మ, పంచాయతీ సెక్రటరీ విజయ్ ఉన్నారు.

పోలీసు అధికారుల విధులపై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పోలీసు అధికారుల విధులపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి మాస్టర్ మైండ్స్ పాఠశాల యాజమాన్యం వీకెండ్ యాక్టివిటీస్‌లో భాగంగా ప్రత్యేకంగా కార్యక్రమాన్ని శనివారం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా టూ టౌన్ పోలిస్ స్టేషన్‌లో విద్యార్థులకు పోలీసుల పనితీరు, స్టేషన్‌కు వచ్చే వారితో వ్యవహరించే తీరు గురించి సీఐ అశోక్ వివరించారు. స్టేషన్ పరిసరాలను ఆసక్తిగా గమనించిన విద్యార్థులు పోలీసుల పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థులతో సరదాగా ముచ్చటించిన పోలీసులు వారికి చాక్లెట్‌లను అందించారు. పోలీస్‌స్టేషన్‌లు, అందులో విధులు నిర్వర్తించే అధికారుల విధులు, ఇతరత్రా అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్వేతారెడ్డి తెలిపారు. ఆయా శాఖల విధుల గురించి విద్యార్థులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. అందుకు అనుగుణంగానే పాఠశాల తరపున పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్వేతారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వసీం పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి మిల్కా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కుటుంబ ఆర్థిక పోషణలో మహిళలు పాలుపంచుకుంటూ ఆర్థికాభివృద్ధి సాధించాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి మిల్కా తెలిపారు. శనివారం విశ్వకర్మ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని తిరుమల తిరుపతి దేవస్థాన కళ్యాణ మండపంలో కేంద్ర ప్రభుత్వం వారి వృత్తి శిక్షణ నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ వారి జన శిక్షణ సంస్థ ఆదిలాబాద్ ఆధ్వర్యంలో వివిధ వృత్తులలో శిక్షణ నేర్చుకున్న అభ్యర్థులకు శనివారం ఆమె సర్టిఫికెట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు వృత్తి శిక్షణ అవసరాన్ని ఆవశ్యకతను, ఆదాయ మార్గాల గురించి అవగాహన కల్పించారు. ఇతర కార్యక్రమాలతో పాటుగా ఈ సంవత్సరం శిక్షణ పొందిన లబ్ధిదారులకు శిక్షణ ధృవపత్రాలను అందజేశారు. ఆమె వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నేర్చుకోవడం వలన ఇంట్లోనే ఉంటూ మహిళలు తమ తమ వృత్తులను కొనసాగించవచ్చని తెలిపారు. ప్రస్తుత కాలంలో ఇంట్లో ఒక్కరే పని చేస్తే ఆర్థికాభివృద్ధి సాధించలేమని అన్నారు. భర్తతో పాటు భార్య నేర్చుకున్న వృత్తిని కొనసాగిస్తూ డబ్బులు సంపాదించవచ్చు అన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి పద్మభూషణ్ రాజు మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా పరిశ్రమల ద్వారా రుణాలు పొంది గ్రూపులుగా గాని ఒక్కొక్కరుగా గాని దరఖాస్తులు చేసుకోవాలని సంబంధిత యూనిట్ పరిశీలించి, మహిళలకు రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. బ్యూటిషన్, టైలరింగ్, మగ్గం, జూట్ ప్రోడక్ట్ మేకర్ శిక్షణలో ఉత్తీర్ణత సాధించిన 300 మంది మహిళలకు వారు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. అంతకుముందు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీసీపీఓ రాజేంద్రప్రసాద్, సెడ్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ఆర్.సురేందర్, జన శిక్షణ సంస్థ డైరెక్టర్ ఎం.శ్యామల, ప్రోగ్రాం ఆఫీసర్ రాజన్న, సంతోష్, సంస్థ సిబ్బంది రాజు, శంకర్, సదానందం, సొహెల్, వివిధ వృత్తుల టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.

పునరావాస ఇండ్ల నిర్మాణ పనులు వేగంగా చేపట్టాలి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి



నవతెలంగాణ-కడెం

రాంపూర్, మైసంపేట్ గ్రామస్తులకు కవ్వాల్ టైగర్, రిజర్వు పునరావాసంలో భాగంగా కొత్త మద్దిపడగ గ్రామంలో నిర్మిస్తున్న ఇంటి నిర్మాణాలను శనివారం నిర్మల్ జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి, మంచిర్యాల ఎఫ్‌డీపీటీ కవ్వాల్ టైగర్ రిజర్వుడ్ ఫారెస్ట్ పి.వినోద్ కుమార్, నిర్మల్ జిల్లా అటవీ అధికారి కె.రామ్ కిషన్, ఖానాపూర్ అటవీ అధికారి ఎం. భవాని శంకర్ వారితో కలిసి పరిశీలించారు. వెంటనే ఇంటి నిర్మాణాలను, రోడ్డు పనులను, నీటి సరఫరా, డ్రైనేజి పనులను, వ్యవసాయ భూమి పనులను వేగవంతం చేయాలని అన్నారు. ఈ నెలలోపు పూర్తి చేయాలని అన్నారు. నిర్మల్ జిల్లాలోని వివిధ శాఖాలకు చెందిన జిల్లా స్థాయి అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు కడెం ఎఫ్ఆర్ఓ అనిత, కడెం మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

బాధిత కండక్టర్‌కు తోటి ఉద్యోగుల ఆర్థిక సాయం

- రూ.లక్ష 10వేలు సాయం చేసి ఉదారత చాటి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆర్టీసీ కండక్టర్‌కు తోటి ఉద్యోగులు ఆర్థిక సాయం అందించి ఉదారత చాటుకున్నారు. ఆదిలాబాద్‌కు చెందిన కండక్టర్ శ్యాంసుందర్ మెదడులో రక్తస్రావం కారణంగా హైదరాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. చికిత్సకు రూ.15లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. చిరుద్యోగి కావడంతో అంత ఖర్చు భరించడం కుటుంబ సభ్యులకు ఇబ్బందిగా మారింది. ఈ విషయం తెలుసుకున్న అధికారులు, కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్‌లు, సూపర్‌వైజర్లు తలో కొంత డబ్బులు పోగు చేసి రూ.లక్ష 10వేలను శనివారం రాత్రి బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో జీఆర్ మౌళి, ఎంబీ రావు, జె.లింగన్న, ఈవీఆర్ కిషన్, సి.సతీష్, పి.సంజీవ్, జ్యోత్ కుమార్, సీఎస్. రాజ్ ఉన్నారు.

చట్టం ముందు అందరూ సమానులే..

నవతెలంగాణ-ఇచ్చోడ

చట్టం ముందు అందరూ సమానులేనని బోథ్ కోర్టు జడ్జీ బి.హుస్సేన్ అన్నారు. శనివారం మండలంలోని జల్ద గ్రామంలో మండల న్యాయసేవాధికార సంస్థ బోథ్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. బోథ్ కోర్టు జడ్జీ మాట్లాడుతూ నిరాధారణకు గురైన వారికి న్యాయం చేసేందుకు న్యాయస్థానం ముందుంటుందన్నారు. రాజ్యాంగం ద్వారా న్యాయస్థానం అందరికీ సమాన హక్కులు కల్పిం చిందన్నారు. తల్లిదండ్రులు పిల్లలను బాగా చదివించాలని అన్నారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి వ్యక్తికి డ్రైవింగ్ లైసెన్సు తప్పనిసరిగా ఉండాలని అన్నారు. లైసెన్స్ లేకుండా ఏ వాహనం నడపరాదన్నారు. మహిళలకు ప్రత్యేక హక్కులు ఉన్నాయని, వాటికి ఎవరూ భంగం కలిగించ రాదన్నారు. చిన్న చిన్న గొడవలకు పోయి జీవితాలు నాశనం చేసుకోకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. తల్లిదండ్రులను గౌరవించాలని, అనాథలుగా వదిలేయకుండా, తల్లిదండ్రులను పోషించాలన్నారు. వరకట్నం, ఆస్తి హక్కులు, ఇతర కేసుల బెయిలు వివరాలు సమాచార హక్కు చట్టం, వినియోగదారుల హక్కు చట్టం గురించి వివరించారు. ముఖ్యంగా రైతులు తమ పొలాల్లో వేసే విత్తనాలు, క్రిమిసంహారక మందులు, ఎరువుల కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రశీదు పొందాలని తెలియజేశారు. పంట పండకపోతే వినియోగదారుల ఫోరంను ఆశ్రయించి, న్యాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి నందకిశోర్ గిత్తే, న్యాయవాదులు అంగద్ కేంద్రే, ధమ్మాపాల్, విక్రమ్‌సింగ్, ఎక్సైజ్ సీఐ రాజమౌళి, ఎస్సై లక్ష్మణ్, పీపీ దివాకర్, పురుషోత్తం, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



అధైర్యపడొద్దు..అండగా ఉంటాం



నవతెలంగాణ-కుభీర్

అధైర్య పడొద్దని అండగా ఉంటానని తెలంగాణ రాష్ట్రంలో రాబోయేది మోదీ ప్రభుత్వమేనని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోస్లే మోహన్‌రావు పటేల్ అన్నారు. శనివారం పార్డి(బి) గ్రామంలో పల్లెపల్లెకు బీజేపీ గడపగడపకు మోహన్‌రావు పటేల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామంలో శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో స్థానిక నాయకులతో కలిసి రాజరాజేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన నియోజక వర్గ నాయకుడికి ఆలయం తరుపున ఆలయ కమిటీ అధ్యక్షుడు వి.మోహన్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం అక్కడి నుంచి శివాజీ విగ్రహానికి, అన్నాబావు సాఠే, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముధోల్ నియోజక వర్గంలో కాషాయ జెండాను ఎగురవేయడానికి ప్రతి ఒక్క కార్యకర్త హర్నిశలు పని చేసి, ముధోల్ నియోజక వర్గంలో బీజేపీ అభ్యర్థిని గెలిపించేలా కృషి చేయాలని అన్నారు. ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పార్డి(బి) గ్రామాన్ని దత్తత గ్రామంగా తీసుకొని ఏండ్లు గడుస్తున్నా అభివృద్ధికి మాత్రం ఆమడ దూరంలో ఉందని విమర్శించారు. కనీసం భైంసా నుంచి పార్డి(బి) వరకు రోడ్డు సౌకర్యం కూడా లేకుండా పోయిందని తెలిపారు. అనంతరం కర్ర వినాయకుడిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యోగిత కమలేష్, మాజీ ఎంపీటీసీ కనోబ, మాజీ జడ్పీటీసీ వి.మోహన్, మాజీ సర్పంచ్ మల్లన్న, రాజన్న, వార్డు సభ్యులు, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ఇంత నిర్లక్ష్యం తగదు

నవతెలంగాణ-తాంసి



రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వ భూముల్లో సంపద వనాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని అన్నారు కానీ ప్రభుత్వం చేపట్టిన సంపద వనాల అమలు చేయడంలో ఇంత నిర్లక్ష్యమా అని సంబంధిత అధికారులపై అదనపు కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం వడ్డాడి ముత్తడి వాగు పరిసర ప్రాంతంలోని ప్రభుత్వ భూమిలో సంపద వన మొక్కలను అధికారులతో కలిసి పరిశీలించారు వివిధ రకాల పండ్ల మొక్కల పెంపకం సరిగాలేక పోవడం వనం పూర్తిగా గడ్డి పెరిగి ఉండటంతో అసంతృప్తి వ్యక్తం చేస్తూ సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. మూడు రోజుల్లో వనంలో పూర్తి స్థాయిలో వివిధ రకాల మొక్కలు నాటాలని, గడ్డిని పూర్తిగా తొలగించాలని ఉపాధి సిబ్బందికి ఎంపీఓకు సూచించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ తెలంగాణ దశాబ్ది వేడుకల సందర్భంగా మొదటి విడతలో ఒకటి చొప్పున రెండున్నర ఎకరాల్లో రెండువేల వివిధ రకాల పండ్ల మొక్కలను నాటడం జరిగిందని అన్నారు. కానీ మొక్కలు నాటి నాలుగు మాసాలు అవుతున్న పూర్తి స్థాయిలో మొక్కలను నాటకపోవడం సంపద వనం పూర్తిగా గడ్డితో నిండిపోవడంతో సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కనబడుతుందన్నారు. ఉపాధి కూలీలతో వనంలోని గడ్డిని పూర్తిగా తొలగించి, మిగతా మొక్కలను నాటాలని అన్నారు. అయినప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవరిస్తే, చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్ డీఎల్‌పీఓ ధర్మారాణి సూపరింటెండెంట్ రవీందర్, ఏపీఓ విజయ, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలి

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- బీఆర్ఎస్‌లో పలువురి చేరికలు



నవతెలంగాణ-లక్ష్మణచాంద

ప్రతి కార్యకర్త పార్టీ పటిష్టితకు సైనికుల్లా పని చేయాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని తిర్పెల్లి గ్రామానికి చెందిన 50 మంది యువకులు నిర్మల్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన చేరికలు కార్యక్రమంలో బీజేపీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి స్వాగతించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. యువకులు, ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా నిర్మల్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో బీఆర్ఎస్ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. పార్టీ అభివృద్ధికి ప్రతి నాయకుడు, కార్యకర్త సైనికుల్లా పని చేయాలని సూచించారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో నిర్మల్ నియోజకవర్గానికి నిధులు తీసుకురావడంతో నిర్మల్ రూపురేఖలు మారుతున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గులాబీ శ్రేణులంతా కులం పేరుతో, మతం పేరుతో రాజకీయం చేస్తున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ప్రజలు నమ్మరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మెన్ ఎర్ర రఘునందన్‌రెడ్డి, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి అడ్వాల రమేష్, మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గ్రూప్-1 పరీక్ష రద్దుతో పట్టణంలో నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నిరుద్యోగుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి ఆరోపించారు. శనివారం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో నిరుద్యోగ అభ్యర్థులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా మరోసారి నిరుద్యోగుల జీవితాలు రోడ్డున పడ్డాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నికల మీద ఉన్న శ్రద్ధ నిరుద్యోగుల జీవితాలపై లేదని, టీఎస్పీఎస్సీ నిర్లక్ష్యం కారణంగా పేపర్ లీకేజీ ఘటన మరవకముందే, రెండో సారి పరీక్ష రద్దు అవ్వడం, అలాగే నోటిఫికేషన్ వెలువడ్డాక సరైన సమయం ఇవ్వకుండా పరీక్ష తేదీలను ప్రకటించడం, సిలబస్ కూడా పెంచడం వల్ల నిరుద్యోగులు అయోమయానికి గురవుతున్నారని అన్నారు. వెంటనే టీఎస్పీఎస్సీ చైర్మెన్‌ను, సభ్యులను బాధ్యతల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, నిరుద్యోగులు ఉన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నవతెలంగాణ-దహెగాం

మండలంలోని ఐనం గ్రామ సమీపంలో గల పెద్దవాగులో కుళ్లిన స్థితిలో ఉన్న గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్టు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఐనం శివారులో పెద్దవాగులో శవం కొట్టుకు వస్తుండగా పశువుల కాపర్లు గమనించి స్థానిక సర్పంచ్ ఎల్ములె జయేందర్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే ఆయన శవాన్ని బయటకు తీయించమని చెప్పడంతో సర్పంచ్ శవాన్ని బయటకు తీయించారు. అక్కడికి చేరుకొని పంచనామా నిర్వహించామని, మృతుడి వయసు సుమారు 30 నుండి 40 సంవత్సరాలు ఉంటుందని, ఒంటిపై బూడిద రంగు అంగీ, లేత నలుపు రంగు ప్యాంటు, బ్రౌన్ కలర్ బనీన్ ధరించి ఉన్నాడని, మృతదేహాన్ని సిర్పూర్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామని ఎస్సై పేర్కొన్నారు. ఎవరైన గుర్తుపట్టినట్టయితే ఫోన్ నెంబర్ 8374494388కు సంప్రదించాలని పేర్కొన్నారు.

పాఠశాల నిర్మాణానికి నిధులు విడుదల చేయాలి

నవతెలంగాణ-కౌటాల



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని వీరవెల్లి పాఠశాల ఒక్కసారిగా కుప్పకూలింది. వీరవెల్లి సర్పంచ్ దృపతాబాయి ప్రభుత్వం పాఠశాల నిర్మాణం కోసం నిధులు విడుదల చేయాలని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పాఠశాల నిర్మాణం కోసం సంబంధిత అధికారులకు విషయాన్ని తెలపడం జరిగిందని, అదేవిధంగా దాని ప్రక్కనే ఉన్న అంగన్‌వాడీ భవనం సైతం శిథిలావస్థలో ఉందని ఆమె తెలిపారు. ప్రస్తుతం పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ ఇంటిలో తరగతులను నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేసుకున్నామని తెలిపారు. దీనిపై కుమురంభీం జిల్లా విద్యాధికారి సైతం స్పందించ్ పాఠశాల నిర్మాణం కోసం చర్యలు చేపట్టాలని ఆమె తెలిపారు.

కాంగ్రెస్‌లో గ్రూపుల లొల్లి

- ఇతర పార్టీలకు వరుస కడుతున్న నాయకులు
- కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన మాజీ మున్సిపల్ చైర్మన్, మాజీ కౌన్సిలర్లు
- ప్రవీణ్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన మాజీ కౌన్సిలర్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఒకప్పుడు తిరుగులేని ఆధిపత్యం కొనసాగించిన కాంగ్రెస్ నేడు గ్రూపు రాజకీయాలతో చతికిలపడుతోంది. కుంరంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాలలో గ్రూపు రాజకీయాలు కాంగ్రెస్‌ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఈ నియోజకవర్గాలలో గ్రూపు రాజకీయాలను రూపుమాపి పార్టీని ఒక తాటిపైకి తీసుకురావాల్సిన అధిష్టానం చూసీ చూడనట్టు వ్యవహరిస్తుండడంతో కొన్నాళ్ల నుండి పార్టీని పట్టుకొని ఉన్న నేతలు ఇతర పార్టీలకు వలస కడుతున్నారు.

కాంగ్రెస్ పార్టీకి చెందిన కాగజ్‌నగర్ మాజీ మున్సిపల్ ఛైర్మన్ దస్తగిరి, మాజీ కౌన్సిలర్ శ్రీరాంగౌడ్, సీనియర్ నాయకులు నజీబ్, యూసుఫ్, సల్మాన్ తదితరులు శనివారం హైద్రాబాద్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. గత కొన్నాళ్ల నుంచి కాంగ్రెస్‌లో స్తబ్దతగా ఉన్న వీరిని స్థానిక బీఆర్ఎస్ నేతలు తమపార్టీలో చేర్చుకునేందుకు ప్రయత్నించి సఫలం చెందారు. దీనితో వీరంతా శుక్రవారం సాయంత్రమే ప్రత్యేక వాహనాలలో హైదారబాద్‌కు తరలివెళ్లి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీకి మొదటి నుండి వెన్నుదన్నుగా ఉన్న మాజీ మున్సిపల్ కౌన్సిలర్ షబ్బీర్‌హుస్సేన్ శనివారం ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సమక్షంలో బహుజన సమాజ్ పార్టీలో చేరారు. ఈయన కూడా నియోజకవర్గంలోని గ్రూపులతో పార్టీలో ఇమడలేక ఈ నిర్ణయం తీసుకున్నాడు.



కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన మాజీ మున్సిపల్ ఛైర్మన్, మాజీ కౌన్సిలర్లు

కుంరంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని రెండు నియోజకవర్గాలలో కూడా కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాలు భగ్గుమంటున్నాయి. గత ఎన్నికలలో సిర్పూరు (టి) నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేసి ఓడిపోయిన పాల్వాయి హరీష్‌బాబు అనంతరం బీజేపీలో చేరాడు. అప్పటి నుండి కాంగ్రెస్ పార్టీ పెద్ద దిక్కును కోల్పోయింది. తర్వాత బీజేపీ నుండి కాంగ్రెస్‌లో చేరిన రావి శ్రీనివాస్ పార్టీ కార్యక్రమాలు చేపడుతూ ముందుకు సాగినా పార్టీలో ఒక వర్గం ఇతనికి సహకారమందించలేదు. తర్వాత స్థానికేతరుడైన కోరళ్ల కృష్ణారెడ్డి ఈ నియోజకవర్గానికి వచ్చి పార్టీ కార్యక్రమాలు చేపట్టడం ప్రారంభించారు. రావి శ్రీనివాస్‌కు సహకారమందించని నేతలు కృష్ణారెడ్డి అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ వచ్చారు. దీనితో ఇక్కడ పార్టీ రెండు వర్గాలుగా చీలింది. ఒక వర్గానికి మాజీ ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు మద్దతు ఇవ్వడం, మరో వర్గానికి డీసీసీ అధ్యక్షులు విశ్వప్రసాద్‌రావు మద్దతు ఇవ్వడంతో మేమంటే మేమనే స్థాయిలో రెండు వర్గాలు ప్రచారం చేసుకోవడం ప్రారంభించాయి. ఈ రెండు వర్గాల మధ్య పార్టీ ముందుకు సాగదనే అభిప్రాయంతో కొన్నేళ్ల నుంచి పార్టీని పట్టుకొని పని చేసిన నేతలు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు.



ఇక ఆసిఫాబాద్ నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి మరో విధంగా ఉంది. ఇక్కడ వలసలు లేకున్నా గ్రూపు తగాదాలు పుష్కలంగా ఉన్నాయి. ఈ నియోజకవర్గంలో కూడా ప్రేంసాగర్‌రావు, విశ్వప్రసాద్‌రావు వర్గీయులు రెండుగా చీలి పార్టీ కార్యక్రమాలలో పాలుపంచుకుంటున్నారు. ప్రేంసాగర్‌రావు వర్గం నుండి రాథోడ్ గణేష్ తనకే టిక్కెట్ వస్తుందని ధీమా వ్యక్తం చేస్తుండగా, విశ్వప్రసాద్‌రావు వర్గం నుండి మర్సుకోల సరస్వతి తనకే టిక్కెట్ అనే ధీమాలో ఉన్నారు. రిటైర్డ్ డీటీఓ శ్యాంనాయక్ ఇటీవలే పార్టీలో చేరి టిక్కెట్‌కు దరఖాస్తు చేసుకొని తనకే టిక్కెట్ వస్తుందని ప్రచారం కూడా ప్రారంబించారు. మరో నలుగురు కూడా టిక్కెట్ కోసం ఈ నియోజకవర్గం నుండి దరఖాస్తు చేసుకున్నారు. అధిష్టానం అభ్యర్థిని ప్రకటించిన తర్వాత ఎవరు పార్టీలో ఉంటారు, ఎవరు పార్టీని వీడుతారనేది తేలే అవకాశముంది.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

- బెల్లంపల్లి ఏరియా జీఎం డి రవిప్రసాద్



నవతెలంగాణ-రెబ్బెన

దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికతను అలవరుచుకోవాలని బెల్లంపల్లి ఏరియా జీఎం డి రవిప్రసాద్ అన్నారు. శనివారం బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీ ఆవరణలో ప్రతిష్ఠించిన గణపతి మండపం వద్ద బెల్లంపల్లి ఏరియా అధికారులతో కలిసి జీఎం డి రవిప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు జీఎంను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం మచ్చగిరి నరేందర్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజ్ శ్రీనివాస్‌రావు, ఏజీఎం(ఈఅండ్ఎం) తిరుమలరావు, ఖైరిగూడ ఓసీపీఓ ఎన్ సత్యనారాయణ, గోలేటి ఓసీపీఓ ఉమాకాంత్, డీవైపీఎంఓ డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్‌కుమార్ బెహెరా, మేనేజర్ ప్రవీన్ పాంటింగ్ పాల్గొన్నారు.

డీఎడ్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా పరీక్షల సంచాలకుడు ఉదయ్‌బాబు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 25 నుంచి జిల్లాలో నిర్వహించే డీఎడ్ పరీక్షలను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా పరీక్షల సహాయ సంచాలకుడు ఉదయ్‌బాబు తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఉర్దూ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షకు సంబంధించి ఇప్పటికే ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. విద్యార్థులు సమయం కంటే అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పరీక్షలు పగడ్బందీగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. సోమవారం నుండి అక్టోబర్ 3 వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆదిలాబాద్ ప్రధాన రహదారిపై వరద కష్టాలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ నుంచి ఆదిలాబాద్ వెళ్లే ప్రధాన రహదారిపై మాణిక్‌గూడ వద్ద నిర్మించిన కల్వర్టుపై వర్షం నీటితో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శనివారం ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో కల్వర్టుపై భారీ గుంతల్లో నీరు చేరడంతో పాటు కల్వర్ట నుండి నీరు ఎటు వెళ్లలేక మోకాళ్ళ లోతుకు చేరింది. దీంతో వాహనదారులు అక్కడే గంటల తరబడి ఎదురుచూడాల్సి వచ్చింది. అత్యవసరమైన ద్విచక్ర వాహన దారులు అష్ట కష్టాలు పడి కల్వర్టు దాటాల్సి వచ్చింది. ఇదే కల్వర్టుపై గతంలో కోవలక్ష్మి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికారులపై మండిపడ్డప్పటికీ తాత్కాలిక మరమ్మతులు చేసి వదిలేశారు. దీంతో ప్రయాణికుల ఇబ్బందులు అలాగే కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కల్వర్టు మీద నీరు నిలవకుండా చూడాలని, గుంతలు పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పంచాయతీ కార్యదర్శులతో సమావేశం



నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో శనివారం డీఎల్‌పీఓ హైమద్ ఉమర్ హుస్సేన్ సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో శానిటేశన్, పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా చూడాలని ఆయన కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ శివకుమార్, కార్యదర్శులు పాల్గొన్నారు.

కండ్లులేని కబోదిల వ్యవహరిస్తున్న ప్రభుత్వం

నవతెలంగాణ-దహెగాం

కండ్లులోని కబోదిలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా నాయకురాలు వజ్రమ్మ విమర్శించారు. 13వ రోజు శనివారం సమ్మెలో కండ్లకు గంతలు కట్టుకొని తమ సమస్యలు పరిష్కరించాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్మికులు గత 13 రోజులుగా వివిధ రకాల నిరసనలు చేపడుతున్నప్పటికీ ప్రభుత్వం కండ్లులేని కబోదిల చూసీచూడనట్టు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. తమ న్యాయపరమైన డిమాండ్లు సాధించుకొనేంత వరకు తరచూ సమ్మె విరమించబోమని పేర్కొన్నారు. అంగన్‌వాడీల సమ్మెకు పంచాయతీ కార్మికులు మద్దతు ప్రకటించి సమ్మెలో కూర్చున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి జుమ్మిడి రవీందర్, గౌరవ అధ్యక్షుడు గడ్డం ప్రభాకర్‌గౌడ్, కోశాధికారి తామెర రాజ్‌కుమార్‌తో పాటు ఆయా గ్రామాల పంచాయతీ కారోబార్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



దహెగాంలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు మద్దతు తెలిపిన సీఐటీయూ నాయకులు



రెబ్బెనలో..

రెబ్బెన : గత 48 సంవత్సరాల నుండి ఐసీడీఎస్‌లో 70 వేల మంది రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం శ్రమదోపిడికి గురిచేస్తుందని, వీరందరికి ఎలాంటి శరతులు లేకుండా పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు బెదిరింపులు మానుకొని రాష్ట్ర జేఏసీ నాయకత్వాన్ని చర్చలకు పిలిపించి సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 13వ రోజు కొనసాగుతున్న అంగన్‌వాడీ టీచర్ల సమ్మెకు సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ ఓదెలు సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రాజెక్టు కార్యదర్శి రాజేశ్వరి, ఆశావర్కర్ల యూనియన్ నాయకురాలు చంద్రకళ, అనిత, బాలమ్మ, ప్రమీల, మంజుల, సింధూ స్వర్ణలత, రామలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

పోరు గ్రామాల్లో యాంటీ లార్వా ఆపరేషన్

నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని పోరుగ్రామలైన జోడేఘాట్, టోకెన్ మోవాడ్, బాబే ఝరి, శివ గూడా గ్రామాల్లో డిప్యూటీ డీఎంహెచ్ఓ, డీఎంఓ ఆదేశాల మేరకు బ్రీడింగ్ చెక్కర్ మునీశ్వర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో యాంటీ లార్వా ఆపరేషన్ నిర్వహించారు. నీరునిల్వ ఉన్న ప్రదేశంలో లార్వాను నిర్మూలించడానికి టేమి పాస్ చేయడం జరిగింది. ఆయా గ్రామాల్లో ని ప్రతి ఇంటిని సందర్శించి మురికి నీరు నిల్వ ఉన్న చోటల్లా, డ్రైనేజీ కాలువల్లో టెమి పాస్ చేశారు. అనంతరం ఆయా గ్రామాల ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, టైఫాయిడ్ లాంటి వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. నీరు నిల్వ ఉండడంతో దోమల పెరుగుదలకు ఆస్కారం ఉంటుందని, దీంతో వ్యాధుల వ్యాప్తికి కారణం అవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామస్తులకు అనారోగ్య సమస్యలు ఏర్పడినప్పుడు వెంటనే స్థానిక సబ్ సెంటర్, పీఎచ్‌సీలకు సమాచారం అందించాలన్నారు.



ప్రలోభాలకు లోను కాకుండా ఓటు వేయాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎన్నికల సమయంలో ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. స్వీట్ యాక్టివిటీస్‌లో భాగంగా ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా ఓటు హక్కు వినియోగం, ఓటు ప్రాముఖ్యతపై కాగజ్‌నగర్ మండలం చారిగాం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సుందిళ్ల రమేష్ పాడిన పాటను శనివారం కలెక్టరేట్‌లో వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగం, ఓటు ఆవశ్యకతపై ప్రజలందరికీ తెలిసే విధంగా జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు, చారిత్రాత్మక ప్రాంతాలలో వీడియో చిత్రీకరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, డీపీఓ సురేందర్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

భారీ వర్షాలతో సిర్పూరు(టి) నియోజకవర్గంలో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు డిమాండ్ చేశారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారీ వర్షాల కారణంగా నియోజకవర్గంలోని పెద్దవాగు, ప్రాణహిత పరివాహక ప్రాంతాలలో రైతులు ప్రతి ఏటా పంటలు నష్టపోతున్నారని, ఈ పంటలకు నష్టపరిహారం చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే విఫలమవుతున్నారని ఆరోపించారు. ప్రతీ ఏడాది రెండు, మూడు సార్లు వరదలు వచ్చి సిర్పూరు, కౌటాల, చింతలమానెపల్లి, పెంచికల్‌పేట్, బెజ్జూరు, దహెగాం మండలాలలో అపారంగా పంట నష్టానికి గురవుతున్నా ఇప్పటి వరకు చిల్లిగవ్వ పరిహారం కూడా ప్రభుత్వం చెల్లించలేదని అన్నారు. ప్రధానమంత్రి ఫసల్‌భీమా యోజనకు రాష్ట్ర ప్రభుత్వం తన వాటా చెల్లించకపోవడంతో పంటల భీమా అమలు కావడం లేదని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కోనప్ప రైతులకు పరిహారం ఇప్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ వీరభద్రచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోలెం వెంకటేశ్, నాయకులు రణవీర్‌బిస్వాస్, మందాడె సుధాకర్, గౌత్రె వెంకటేష్ పాల్గొన్నారు.

వైద్యకళాశాలకు కొండ లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని వైద్యకళాశాలకు కొండ లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలని పద్మశాలి సేవ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల ఆంజనేయులు కోరారు. శనివారం పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ బొర్కాడే హేమంత్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాధనలో కొండ లక్ష్మణ్ బాపూజీ ఎంతగానో కృషి చేశారని అన్నారు. అటువంటి మహనీయుడికి ఘనమైన నివాళి అర్పించాల్సిన భాధ్యత జిల్లా ప్రజలుగా ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనడంతో పాటు తెలంగాణ కోసం తన మంత్రి పదవిని త్యాగం చేసిన గొప్ప మహనీయుడని కొనియాడారు. అటువంటి మహనీయుని పేరును జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్య కళాశాలకు పెట్టడం వల్ల జిల్లా చరిత్ర మరింత ఇనుమడింప చేసినట్లు అవుతుందన్నారు. అధికారులు నాయకులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గడదాసు మల్లయ్య, గుండా శంకర్, కోమటిపెల్లి లింగయ్య, ఇరుకుల్ల మంగ, ఇరుకుల్ల పుష్పలత, అనుమాండ్ల శ్రీకాంత్, జంజిరాల సంజీవ్, తేలివార్ మోహన్, శైలేందర్, శ్రీనివాస్, మదూకర్, వేణు గోపాల్, యేసయ్య, సునీల్, శ్రీనాథ్, రవి పాల్గొన్నారు.

వేధింపులకు గురిచేసిన అధికారులను శిక్షించాలి



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి సింగరేణి ఏరియాలో పైఅధికారుల వేధింపులకు ఆస్పత్రిలో చావుబతుకుల్లో ఉన్న తన తండ్రికి తగిన న్యాయం చేయాలని కోరుతూ పొట్ట స్నేహ అనే యువతి ఏరియా కార్మిక సంఘాలైన హెచ్ఎంఎస్, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, టీబీజీకేయస్ సంఘాలను కలిసి వినతిపత్రాలు అందజేశారు. తన తండ్రి పొట్ట శ్రీనివాస్ గోలేటిలో ఎస్ఎంపీసీ జమీందార్‌గా విధులు నిర్వహిస్తున్నాడని తెలిపారు. తన తండ్రి కొన్ని రోజుల క్రితం మీచ్యుల్ ట్రాన్స్‌ఫర్ పెట్టుకోగా అధికారులు అట్టి దరఖాస్తును ట్రాన్స్‌ఫర్ డిపార్టుమెంటుకు పంపకపోగా పలు విధాలుగా ఇబ్బందులకు గురిచేయడంతో మానసిక క్షోభకు గురై అనారోగ్యం క్షీణించి ఆస్పత్రిపాలు అయినట్టు తెలిపారు. దీనికి కారణమైన అధికారులపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా హెచ్ఎంఎస్ యూనియన్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ పత్యం రాజాబాబు, టీబీజీకేఎస్ నాయకులు కోరం కిరణ్ మాట్లాడుతూ కార్మికులను రక్షించాల్సిన అధికారులే వారిని ఇబ్బందులకు గురిచేసి ఆస్పత్రిపాలు అయ్యే విధంగా చేయడం చాలా బాధాకరమన్నారు. పై అధికారుల ఇబ్బందులు తట్టుకోలేక పొట్ట శ్రీనివాస్ మానసిక క్షోభకు గురై ఆస్పత్రిలో చావుబ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడని తెలిపారు. శ్రీనివాస్ పెట్టుకున్న నీచ్యల్ ట్రాన్స్‌ఫర్ ఎందుకు జరగలేదని అధికారులు సమాధానం చెప్పాల్సి ఉందన్నారు. అదేవిధంగా శ్రీనివాస్ రాసిన లెటర్ ఆధారంగా అతడి పేర్కొన్న అధికారులను విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. శ్రీనివాస్‌కు న్యాయం జరిగేంత వరకు తమ సంఘాల తరపున అండగా ఉంటామని పేర్కొన్నారు.

గుండ్లపేటలో కార్డన్ సెర్చ్

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండలంలోని గుండ్లపేట గ్రామంలో పోలీసులు శనివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తనిఖీ చేసి సరైన ధ్రువీకరణ పత్రాలు లేని పది వాహనాలు గుర్తించారు. ఈ సందర్భంగా ఎస్సై కొమురయ్య మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సురేష్‌కుమార్, సీఐ నాగరాజు ఆదేశాల మేరకు కార్డన్ సెర్చ్ నిర్వహించామన్నారు. గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలు జరిగితే సమాచారం అందించాలని, అపరిచిత వ్యక్తులు గ్రామంలో సంచరించినట్టయితే సమాచారం అందించాలని గ్రామస్తులకు సూచించారు. అనంతరం సైబర్ క్రైమ్, ప్రభుత్వ నిషేధిత మత్తు పదర్థాలపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమౌళి, పోలీసులు పాల్గొన్నారు.

కేసీఆర్, కవిత చిత్రపటాలకు పాలాభిషేకం

నవతెలంగాణ -రెబ్బెన



మండలంలోని గోలేటి సీహెచ్‌పీలో సింగరేణి కార్మికులు ముఖ్యమంత్రి కేసీఆర్, కవిత చిత్రపటానికి శనివారం పాలాభిషేకం నిర్వహించారు. సింగరేణి ఉద్యోగులకు 11వ వేజ్‌బోర్డు ఏరియర్స్ రూ.1700 కోట్లు ఒకే దఫాలో చెల్లించినందుకు, లాభాల వాటా రూ.700 కోట్లు దసరాకు ముందే చెల్లించనున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సింగరేణి ఉద్యోగులు ధన్యవాదాలు తెలుపుతూ బెల్లంపల్లి ఏరియా గోలేటి సీహెచ్‌పీలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం, మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ ఆమోదింప చేయడానికి కృషి చేసిన కల్వకుంట్ల కవితకు ధన్యవాదాలు తెలుపుతూ పాలాభిషేకం చేశారు.

సబ్బెపల్లి ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

- హాజరైన జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ అసదుల్ల



నవతెలంగాణ-హాజీపూర్

మండలంలోని సబ్బెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం లక్షెట్టిపేట్ బార్ అసోయేషన్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన జూనియర్ సివిల్ జడ్జీ మహమ్మద్ అసదుల్లా షరీఫ్ మాట్లాడుతూ విద్యార్థులందరూ వివిధ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, తమ కెరీర్‌ను ఉన్నతంగా మలుచుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులుగా చట్టప్రకారం నడుచుకోవాలని చుట్టుపక్క ప్రాంతాల్లో చట్ట వ్యతిరేక చర్యలు ఏమున్నా కూడా పెద్దలకు తెలియజేయాలని అన్నారు. కెరీర్ గైడెన్స్ గురించి వ్యక్తిత్వ వికాసం గురించి పలు విషయాలు వివరించారు. ఉచితంగా న్యాయ సలహా పొందడం, లోక్ అదాలత్ వంటి అంశాలను కూడా చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధారాణి, లక్షెట్టిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు కారుకూరి సురేందర్, ఏజీపీ పద్మ, జైలర్ స్వామి, బార్ సోసియేషన్ ప్రతినిధులు వినీత గణేష్, తాజుద్దీన్, సదాశివ, రవిరాజు, సురేందర్, మల్లికార్జున్, హాజీపూర్ సర్పంచ్ జూపాక రాజేశ్వరి పాల్గొన్నారు.

స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా శ్రమదానం



నవతెలంగాణ-మందమర్రి

స్వచ్ఛత హీ సేవ కార్యక్రమములో భాగంగా ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం శ్రమదానం నిర్వహించారు. కార్యాలయ పరిసరాల్లోని గడ్డి, పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ స్వచ్ఛతా హి సేవ ప్రచారం ఈ నెల 15న ప్రారంభమైందని వచ్చే నెల అక్టోబరు 2 వరకు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. 2023కు సంబంధించి 'చెత్త రహిత భారతదేశం' అనే థీమ్‌పై కార్యక్రమం నడుస్తుందన్నారు. జన సంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో చెత్తను తొలగించడం, రోడ్లు, కాల్వలు పరిశుభ్రం చేయడం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడం కార్యక్రమ ఉద్దేశ్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్రం మంగ గౌడ్ ఎంపీపీ అధ్యక్షులు, వేల్పుల రవి జడ్పీటీసీ, పి శశికళ ఎంపీడీఓ మందమర్రి, లౌడం రాజ్ కుమార్ మండల ఉపాధ్యక్షుడు ఎండీ నసీరుద్దీన్, మండల కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు పున్నం, సది, శ్రీనివాస్, బీరయ్య పాల్గొన్నారు.

ధరలకు అనుగుణంగా వేతనం అందించాలి



నవతెలంగాణ-తాండూర్

పెరుగుతున్న ధరల అనుగుణంగా ఫిక్స్ వేతనం రూ.18000 అందించాలని ఆశా కార్యకర్తలు శనివారం ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించి వైద్యాధికారి సుచరితకు మెమోరాండం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశాలకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. ఏఎన్ఎం, జీఎన్ఎం పోస్టుల్లో ఆశాలకు ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లెప్రసీ సర్వేలో వాలంటీర్లను ఏర్పాటు చేయాలన్నారు. 2021 జూలై నుంచి డిసెంబర్ వరకు 6 నెలల పీఆర్సీ ఎరియర్స్ వెంటనే చెల్లించాలని, కేంద్రం చెల్లించిన కరోనా రిస్క్ అలవెన్స్ నెలకు వెయ్యి చొప్పున 16 నెలల బకాయి డబ్బులు వెంటనే చెల్లించాలనిడిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సునీత, రాజేశ్వరి, భారతి, రేవతి, తిరుమల, సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు రాజారాం పాల్గొన్నారు.

రాష్ట్ర విద్యాభివృద్ధిపై సర్వే

నవతెలంగాణ-కోటాల

రాష్ట్ర విద్యాభివృద్ధి సర్వేలో భాగంగా శనివారం ముత్తంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గావుడె హన్మంతు కాంప్లెక్స్ పరిధిలోని పలు పాఠశాలల్లో మూడో తరగతి చదువుతున్న విద్యార్థులు విద్యాభివృద్ధిపై పరీక్షల విధానాన్ని పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ పరీక్షలను మూడో తరగతి విద్యార్థులందరు వినియోగించుకొని ఈ సర్వేను విజయవంతం చేయాలని వారు పలు పాఠశాలలఉపాధ్యాయులకు సూచించారు.

గణేష్ మండపాల వద్ద అన్నదానం

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలోని ఇంద్రానగర్, పోచమ్మబస్తి తదితర వాడల్లో శనివారం గణేష్ మండపాల వద్ద మండల కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అధికారులు అంకితభావంతో పని చేయాలి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

నవతెలంగాణ-తాండూర్



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

అధికారులు అంకితాభావంతో పని చేసినప్పుడే అభివద్ధి సాధ్యమవుతుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ, ఉద్యానవన ధికారులు సమన్వయంతో రైతులను వాణిజ్య వంటల వైపు దృష్టి సారించేలా ప్రోత్సహించాలన్నారు. తాండూరు మండలంలో టమాట మల్లె తోటలు విస్తారంగా ఉన్నాయని రైతులను మరింతగా ప్రోత్సహించాలన్నారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో డ్రాగన్ ఫ్రూట్, మామిడి, ఆయిల్ ఫామ్ తోటలను సాగు చేస్తున్న రైతులను మరింత ప్రోత్సహించాలని సూచించారు. రైతు వేదికలు ఆశించిన మేరకు రైతులకు ఉపయోగపడటం లేదన్నారు. రైతులను సమావేశపరిచి సమిష్టి నిర్ణయాలు తీసుకునేలని, వ్యవసాయ అధికారులు కృషి చేయాలని ఏడీఏ సురేఖకు సూచించారు. గొల్ల కురుమ సంచార జాతులకు పంపిణీ చేస్తున్న గొర్రెలను ఇంటి వద్ద పెంచుకునేలా సంవర్ధక శాఖ అధికారులు కృషి చేయాలన్నారు. లబ్ధిదారులకు మేకల గొర్రెల షెడ్లు, పశుగ్రాసం విత్తనాలు అందించే విధంగా ఉపాధి హామీ అధికారులు ప్రణాళికలు చేపట్టాలన్నారు. పశు సంవర్ధక శాఖ సహకారంతో గొల్ల కురుమల సొసైటీలను అభివృద్ధి చెందే విధంగా కృషి చేస్తున్నట్లు పశువైద్యాధికారి భూమన్న పీవీ నరసింహారావులు తెలిపారు. గిరివికాసం పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ సన్నకారు రైతులకు ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని అందించి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నట్లు ఏఈ ప్రభాకర్ తెలిపారు. మండలంలో 8 కొత్త వ్యవసాయ కనెక్షన్లను అందించినట్లుతెలిపారు. అటవీ శాఖ ద్వారా చిట్టడవుల్లో మొక్కలు నాటి పోషిస్తున్నట్లు మాదారం ఎఫ్ఆర్ఓ బేగం తెలిపారు. సీజనల్ వ్యాధులు దృష్టిలో ఉంచుకొని మండల ప్రజల అందరికీ వైద్యం అందేలా కృషి చేయాలని వైద్యాధికారి సుచరితకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పూసాల ప్రణయ్ కుమార్ జడ్పీటీసీ బాలయ్య, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీదేవి ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ రోహిత్, సీడీపీఓ ఉమాదేవి, ఎంఈఓ ప్రభాకర్ పంచాయతీ రాజ్ ఏఈ శంకర్, అప్పలనాయుడు, కేజీబీవీ ఎస్ఓ సుమన పాల్గొన్నారు.

పోరాటాన్ని ఉధృతం చేస్తాం

- సీఐటీయూ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు దూలం శ్రీనివాస్
- అంగన్‌వాడీల సమ్మెకు ఆశా కార్యకర్తల మద్దతు



కాసిపేటలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

నవతెలంగాణ-కాసిపేట

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని సీఐటీయూ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు దూలం శ్రీనివాస్ పేర్కొన్నారు. కాసిపేటలో అంగన్‌వాడీల సమ్మె 13వ రోజు శనివారం చేరుకోగా వారికి ఆశా కార్యకర్తలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీల పోరాటం విజయవంతం అయ్యే వరకు ఆశాలు అండగా ఉంటామని, సెప్టెంబర్ 25 నుంచి ఆశా వర్కర్లు కూడా వారి సమస్యలను పరిష్కరించాలని నిరవధిక సమ్మెకు వెళ్లడం జరుగుతుందని, సమ్మెలో ఒకే టెంట్ కింద కలిసి పోరాడుదాం అంటు పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న అంగన్‌వాడీల సమ్మె రోజు రోజుకు ఉధృతం అవుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించకుండా అంగన్‌వాడీల న్యాయమై డిమాండ్లను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

యూనియన్ నాయకులతో చర్చలు జరపాలి

తాండూర్ : అంగన్‌వాడీల సమ్మె డిమాండ్లను పరిష్కరించేల యూనియన్ నాయకులతో వెంటనే చర్చలు జరపాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకే రవి డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం పేరు చెప్పి రాష్ట్ర ప్రభుత్వం తప్పించుకోవాలని చూస్తుందన్నారు. 5 సంవత్సవాలు పదవీలో ఉన్న ఎమ్మెల్యేకు పెన్షన్ ఇచ్చే ప్రభుత్వం, 20 నుంచి 35 సంవత్సరాలు పని చేసిన అంగన్‌వాడీలకు పెన్షన్ విధానాన్ని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో మండల స్థాయి నాయకుల నుంచి ముఖ్య మంత్రికి, మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఉన్నంత జీత భత్యాలు పెంచిన ప్రభుత్వం అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్ల పరిష్కరంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి కేంద్రాల తాళాలను పగలగొట్టి నియంతృత్వ చర్యలకు పాల్పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల నాయకులు ఏల్పుల శంకర్, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు దాగం రాజారాం, సత్యావతి, ప్రమీల, లీల, భారతి, శారద, విజయలక్ష్మీ, విజయ పాల్గొన్నారు.



తాండూర్ : అంగన్‌వాడీల సమ్మె

పారిశుధ్యం లోపంతోనే జ్వరాలు

- జిల్లా వైద్యాధికారి సుబ్బారాయుడు

నవతెలంగాణ-కాసిపేట



గ్రామాల్లో పారిశుధ్యం లోపించడంతో జ్వరాలు ప్రబలుతున్నాయని, గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టాల్సిందిగా మంచిర్యాల జిల్లా వైద్యాధికారి సుబ్బారాయుడు సూచించారు. మండలంలోని దేవాపూర్‌లో శనివారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓరియంట్ సిమెంట్ కంపని అధికారులతో మాట్లాడారు. గ్రామాల్లో పెరుగుతున్న వైరల్ జ్వరాలకు కారణం పారిశుధ్యం సక్రమంగా లేకపోవడమే అన్నారు. దీనిపై యాజమాన్యం దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలన్నారు. కంపెని డిస్పెన్సరిని తనిఖీ చేసి వివరాలు తెలుసుకున్నారు. వ్యాధిగ్రస్తులు ఎవరు వచ్చిన ఎటువంటి లక్షణాలు, జ్వరాలు ఉన్న మండల వైద్యాధికారికి సమాచారం ఇవ్వాలన్నారు. దేవాపూర్, మద్దిమాడ సర్పంచ్లను కలిసి ఎటువంటి లోపాలు లేకుండ చర్యలు చేపట్టాలన్నారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని, పెరుగుతున్న జ్వరాల నేపథ్యంలో గ్రామాల్లో రోజుకు 13 వైద్య శిబిరాలు సిబ్బందితో నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేల ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. గ్రామాల్లో జరుగుతున్న వైద్యశిబిరాలు పరిశీలించారు. ఆయన వెంట వైద్యాధికారి రవికిరణ్, వైద్యసిబ్బంది ఉన్నారు.

నేడు సీపీఐ నియోజకవర్గ కౌన్సిల్ సమావేశం


- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్ర శేఖర్

నవతెలంగాణ-కాసిపేట

బెల్లంపల్లి నియోజకవర్గ కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు సీపీఐ నియోజకవర్గ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం సోమగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి నియోజకవర్గంలో ఉన్న ఏడు మండలాలు, బెల్లంపల్లి పట్టణంలోని కౌన్సిల్ సభ్యులతోసమావేశం ఉంటుందన్నారు. సమావేశానికి అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేని శంకర్, సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ హాజరవుతారన్నారు. రాష్ట్ర కౌన్సిల్, జిల్లా కార్యవర్గ సభ్యులుతో సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో బెల్లంపల్లి నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేస్తూ గ్రామ శాఖ, బూత్ కమిటీ సభ్యులకు దిశా నిర్దేశం చేయడం, ఏ విధంగా ముందుకు పోవాలని నాయకులకు తెలియడం జరుగుతుందని, అందరూ సకాలంలో హాజరై సమావేశంను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి దాగం మల్లేష్, నాయకులు బొంతల లక్ష్మీ నారాయణ, గట్టు సర్వేశం, జాడి పోశం, దాగం రాజలింగు, జాడి క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-జన్నారం



సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్‌హెచ్‌పీ ప్రదీప్, మండలం సర్పంచుల సంఘం అధ్యక్షుడు జాడి గంగాధర్ అన్నారు. శనివారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామపంచాయతీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో పలువురికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఏఎన్ఎం అపరంజి, అంగన్‌వాడీ సంజీవరాణి పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను ఎంచుకోవాలి

నవతెలంగాణ-తాండూర్

విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలనుంచుకొని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని సీపీఐ మాజీ డైరెక్టర్ వివి లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం తాండూరు కేజీబీవీని ని సందర్శించి విద్యార్థులకు ప్రేరణ సందేశాన్ని అందించారు. లక్ష్యాలను ఛేదించే సమయంలో ఒడిదుడుకులు సహజమని వాటిని అధిగమించి లక్ష్యాలను చేదించాలన్నారు. విద్యార్థులు చదువు పట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు. కష్టపడి చదివిన వారికి సమాజంలో గుర్తింపు లభిస్తుందని తెలిపారు. పట్టుదలతో కృషి చేసి ఫలితాలను రావట్టాలన్నారు. విద్యార్థులను ఉద్దేశించి ఎన్నో విలువైన విషయాలు తెలియజేశారు. లక్ష్యం ఏర్పరచుకోవటం జీవితంలో తల్లిదండ్రుల రుణం తీర్చుకోవటం మన బాధ్యతలను నేరవేర్చటం అనే అంశాలపైన అవగాహన కల్పించారు. పాటశాల ఆవరణలో మొక్కను నాటి విఘ్నేశ్వరుడిని దర్శించుకున్నారు. పాటశాలకు కావాల్సిన గ్రంథాలయ పుస్తకాలను విరాళంగా అందజేస్తానని తెలిపారు. సమావేశంలో ఎస్ఓ సుమన చైతన్య అడ్వకేట్ ఉదయ్ అధ్యాపక బృందం పాల్గొన్నారు.

చదరంగం పట్ల విద్యార్థులు మక్కువ పెంచుకోవాలి



నవతెలంగాణ-మందమర్రి

చదరంగం పట్ల విద్యార్థులు మక్కువ పెంచుకోవాలని ఆదిలాబాద్ జిల్లా ఈడీఎస్ చైర్మన్ దుర్గా ప్రసాద్ సూచించారు. శనివారం పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ హై స్కూల్‌లో మంచిర్యాల జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ చెస్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆదిలాబాద్ ఈడీఎస్ చైర్మన్ దుర్గా ప్రసాద్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదరంగం పట్ల మక్కువ పెంచుకోవాలని, క్రీడలను జీవితంలో ఒక భాగంగా ఎంచుకోవాలని సూచించారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ సిరాజ్ ఉర్ రహమాన్, మాజీ ఎస్టిఎఫ్ అధ్యక్షుడు రాజయ్య, లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ కరెస్పాండంట్ దామెర్ల సిద్దయ్య, బీఆర్ఎస్ నాయకులు బొరిగం వెంకటేష్, కల్చరల్ ప్రెసిడెంట్ సంతోష్, ఉమ్మడి జిల్లా చెస్ చైర్మన్ ఈగ కనకయ్య, చీఫ్ అర్బీటర్ అంబాలా కల్పనా, కోచ్ సుజన్ పాల్గొన్నారు.

పాఠశాలకు డిజిటల్ బెల్ వితరణ



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని వెల్గనూరు గ్రామానికి చెందిన నలిమెల మహేష్ అనే యువకుడు గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివి ఇటీవలే అనారోగ్యంతో మరణించగా ఆయన జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు పాఠశాలకు డిజిటల్ బెల్ విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా సుమారు రూ.9000 వేల విలువగల డిజిటల్ బెల్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు గాయత్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామానికి చెందిన యువత పాఠశాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని చాలా సందర్భాల్లో దాతలు ముందుకు వచ్చి సహాయాన్ని అందిస్తున్నారని ఆమె తెలిపారు. భవిష్యత్తులో గ్రామస్తుల సహకారం ఎప్పటికీ ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో మేధాశక్తి పెంపొందించాలి



నవతెలంగాణ-తాండూర్

విద్యార్థుల్లో మేధాశక్తిని పెంపొందించడానికి క్రీడలు ఎంతగానో ఉపకరిస్తాయని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సురభి గోదా క్షేత్ర ఫంక్షన్ హాల్‌లో మంచిర్యాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన చెస్ పోటీలను నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండోర్ గేమ్‌లు ఆడడం వల్ల విద్యార్థుల్లో మేధాశక్తిని పెంపొందించవచ్చునన్నారు. విద్యార్థులకు పుస్తక పాఠనంతో పాటు క్రీడల్లో రాణించే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి సంవత్సరం క్రీడా పోటీలు నిర్వహిస్తున్న అభినవ సంతోష్, సహకరిస్తున్న శరత్‌ను అభినందించారు. పోటీల్లో బెల్లంపల్లి, మందమర్రి, తాండూర్ పరిసర ప్రాంతాల అండర్-14, 17 బాలబాలికలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రణయ్, జడ్పీటీసీ బానయ్య, ఎంపీటీసీ మొగిలి శంకర్, సర్పంచ్ నవీన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంతోష్, కోఆప్షన్ సభ్యులు రహ్మత్ ఖాన్, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు దత్తుమూర్తి, పీఈటీ పరిమళ పాల్గొన్నారు.

5
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
ఆదివారం | సెప్టెంబర్ 24, 2023 | www.navatelangana.com

డీడీలు కట్టిన ప్రతి ఒక్కరికీ గొర్రెల యూనిట్

జైపూర్ : ప్రభుత్వం ప్రవేశపెట్టిన గొర్రెల యూనిట్లు డీడీలు కట్టిన ప్రతి యాదవ కుటుంబానికి పంపిణీ చేస్తామని జిల్లా గొర్రెల పెంపకం వృత్తిదారుల సహకార సంఘం చైర్మెన్ కొమ్ము అశోక్ యాదవ్ భరోసా ఇచ్చారు. శనివారం కానుకూరు గ్రామానికి చెందిన యాదవ కుటుంబాలతో కలిసి సమావేశమైన ఆయన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యాదవ కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవడం కోసం కట్టుబడి పని చేస్తుందని తెలిపారు. చెన్నూర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ చొరవతో నియోజకవర్గం పరిధిలో ప్రతి యాదవ కుటుంబానికి గొర్రెల యూనిట్లు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యులు సతీష్, ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం అధ్యక్షులు గుండు తిరుపతి, సొసైటీ అధ్యక్షులు కల్కి ఐలయ్య, సభ్యులు జంబుల మల్లేష్, కల్కి పర్వతాలు, ఎగ్గడి గట్టయ్య, అన్న పోషం, కొమ్ము సాయిలు, కల్కి శ్రీనివాస్, మధునయ్య పాల్గొన్నారు.



నిమజ్జన శోభాయాత్రకు ఏర్పాట్లు

నవతెలంగాణ-ముథోల్

గణేష్ నిమజ్జన శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేశామని ఎస్పీ ప్రవీణ్ తెలిపారు. శనివారం మండలంలో ఆయన పర్యటించారు. వీధుల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను సందర్శించారు. అనంతరం రామమందిరంలో ప్రతిష్టించిన గణేష్ మండలంలో ఎస్పీ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎస్పీని ఘనంగా సన్మానించారు. అనంతరం నిమజ్జనం శోభాయాత్ర ర్యూట్ మ్యాప్‌ను ఎస్పీ పరిశీలించి సూచనలు చేశారు. నిమజ్జనం సందర్భంగా చేపట్టే బందోబస్తు వివరాలను సీఐ వినోద్ రెడ్డి, ఎస్సై సాయికిరణ్‌లను అడిగి తెలుసుకున్నారు.



'పల్లె ప్రాంతాల్లో సమూల మార్పు తీసుకొచ్చాం'

నవతెలంగాణ-బేల

పల్లె ప్రాంతాల్లో సమూల మార్పులు తీసుకువచ్చి, గ్రామస్తుల ఇక్కట్లను దూరం చేసిన ఘనత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికే దక్కిందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శనివారం మండలంలో విస్తృతంగా పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ముందుగా మశాల గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యేకు స్థానికులు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. స్థానికంగా నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. అనంతరం హేటి గ్రామంలో రూ.2లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ ప్లాట్‌ఫాం, రూ.5లక్షలతో నిర్మించనున్న షెడ్ నిర్మాణ పనులను ప్రారంభించారు. గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలకగా స్థానిక నాయకులతో కలిసి పనులను ప్రారంభించారు. అదేవిధంగా ఏకోరి గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించనున్న గ్రామపంచాయతీ భవనానికి భూమిపూజ చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దాదాపు అరవై ఎనిమిది సంవత్సరాలు పాలించిన గత ప్రభుత్వాలు ప్రజలకు కనీస వసతులు కల్పించలేకపోయాయని అన్నారు. పల్లె ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అనతి కాలంలోనే పల్లెలు అభివృద్ధి పథంలో దూసుకెళుతున్నాయని స్పష్టం చేశారు. రైతులు సైతం గతంలో అనేక ఇబ్బందులకు గురయ్యారని, ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవని అన్నారు. సర్కారు పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ దవాఖానాల్లోనూ అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. వైద్య, విద్య, వ్యవసాయం వంటి ప్రధాన రంగాలకు విశేష ప్రాధాన్యతను ఇవ్వడం ద్వారా గణనీయమైన మార్పును సాధించగలిగామని తెలిపారు. ప్రజా సంక్షేమానికి పాటు పడుతున్న రాష్ట్ర ప్రభుత్వానికే ప్రజాదరణ లభిస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రౌత్ మనోహర్, జైనథ్ మార్కెట్ కమిటి చైర్మెన్ గోడం వర్ష, సర్పంచ్ ఇంద్రశేఖర్, ప్రమోద్‌రెడ్డి, మెట్టు ప్రహ్లాద్, బండి సుదర్శన్, గంబీర్ ఠాక్రే, సతీష్ పవార్, బత్తుల సుదర్శన్, విపిన్ ఖోడే, దీపక్ గౌడ్ పాల్గొన్నారు.

పౌష్టికరమైన ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వాలి



నవతెలంగాణ-జైపూర్

మనం రోజు తీసుకుంటున్న ఆహారంలో పౌష్టికరమైన ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వాలని శివ్వారం సర్పంచ్ ఆవిడపు గణేష్ సూచించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం అంగన్‌వాడి కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. ఇంటి పెరట్లో దొరికే ఆకు కూరలతో పాటు కూరగాయలు ప్రతి రోజు ఆహారంగా తీసుకోవడం మంచిదని పేర్కొన్నారు. అదేవిధంగా వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వలేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండే పాత్రలను ఎప్పటికప్పుడు ఖాళీ చేసి నింపుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పండ్లు, కూరగాయలతో ఏర్పాటు చేసిన ప్రదర్శన ద్వారా బలవర్ధకమైన ఆహారంపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్వేత, అంగ్‌వాడీ కార్యకర్తలు ఆవిడపు మల్లక్క, కొప్పుల రాణి పాల్గొన్నారు.

కుల రాజకీయాలు మానుకోవాలి

నవతెలంగాణ-ఖానాపూర్

మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ కుల రాజకీయాలు మానుకోవాలని ఎస్సీ, ఎస్టీ, దళిత గిరిజనులు హితవు పలికారు. శనివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సీ, ఎస్టీ నాయకులు మాట్లాడుతూ 30 ఏళ్ల రాజకీయ అనుభవమున్న రాథోడ్ రమేష్ మహిళలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. దళితులకు గిరిజనులకు మధ్య గొడవలు సృష్టించి రెచ్చగొట్టుతున్నారని ఆరోపించారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులు, స్టేషన్‌పై దౌర్జన్యం ప్రదర్శించడం హేయమైన చర్య అని అన్నారు. రాజకీయ లబ్ధి కోసం ఇలాంటి పనులు చేయడం మానుకోవాలని హితువు పలికారు. ఈ సమావేశంలో ఎస్సీ,ఎస్టీ,దళిత గిరిజన సంఘం నాయకులు రాజ గంగన్న, సిద్దార్థ నాయక్, సరోజ ప్రణీత్, రాకేష్ పాల్గొన్నారు.

సింగరేణి ఏరియాస్పత్రిని సందర్శించిన జీఎం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలోని సింగరేణి ఏరియా ఆసుపత్రిని శనివారం మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఏ.మనోహర్ సందర్శించి తనిఖీలు చేపట్టారు. ఆసుపత్రి పరిసరాలను, వార్డులను, ఆక్సిజన్ ప్లాంట్, మురికి నీటి శుద్ధి చేసే ప్లాంటును పరిశీలించారు. ఆసుపత్రిలోని విభాగాల గురించి అడిగి తెలుసుకున్నారు. సింగరేణి ఉద్యోగులకు ఎల్లవేళలా మంచి వైద్యం అందించాలని డాక్టర్లకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం రీజనల్ ల్యాబ్ ఆర్‌కె సిఓపి క్లబ్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓ టు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఎజీఎం నాగరాజు, డివైసీఎంఓ డాక్టర్ ఉష, ఏరియా స్టోర్స్ ఎస్‌ఈ పైడిశ్వర్, ఎస్టేట్ అధికారి కుమారస్వామి, ఆర్‌కె ఓసిపి ప్రాజెక్ట్ అధికారి గోవిందరావు, మేనేజర్ వెంకటేశ్వర్లు, క్వాలిటీ మేనేజర్ ప్రదీప్, డాక్టర్లు పాల్గొన్నారు.

పోషణ మాసం వారోత్సవాలు

నవతెలంగాణ-కడెం

మండలంలోని అంబారిపేట్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం-2లో పోషణ మాసం వారోత్సవాల కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మి లచ్చన్న మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు బాలింతలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రం-2 టీచర్ హేమలత, ఆశ కార్యకర్త విజయ పాల్గొన్నారు.

మహిళా హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్ : మహిళా హక్కులపై ప్రతి ఒక్క మహిళకు అవగాహన కలిగి ఉండాలని మిషన్ శక్తి, మహిళా సాధికారత కోఆర్డినేటర్ యశోద పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లోని లక్ష్మీ పారామెడికల్ కాలేజీలో మిషన్ శక్తి, బేటి బచావో, బేటి పడావో ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ మేరకు ప్రభుత్వాల అమలు చేస్తున్న మహిళా సంక్షేమ పథకాలు, మహిళ చట్టాలు, బాల్యవివాహం, ఫోక్సో చట్టం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

26న వీరనారి చాకలి ఐలమ్మ జయంతి

ఆదిలాబాద్‌టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వీరనారి చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమాన్ని అధికారికంగా ఈనెల 26న ఉదయం 11:00 గంటలకు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఎదుట నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమస్తా రజక ప్రజలు, బీసీ ప్రజలు, నాయకులు, విచ్చేసి జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రాజూరాలో ఉద్రిక్తతకు దారితీసిన జాన్సన్ పర్యటన

- గ్రామస్తులు, పోలీసుల మధ్య వాగ్వాదం
- లాఠీఛార్జీ అర్ధరాత్రి వరకు పోలీస్‌స్టేషన్‌లో హైడ్రామా

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్ నాయక్ పర్యటనలో జరిగిన చిన్నపాటి వాగ్వాదం ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులు, రాజూరా గ్రామస్తులకు మధ్య ఘర్షణ వాతావరణానికి కారణమైంది. ఈ సంఘటనతో పోలీస్‌స్టేషన్‌లో నాలుగు గంటల పాటు హైడ్రామా నడిచింది. శుక్రవారం రాత్రి మండలంలోని రాజూరా గ్రామానికి బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్ నాయక్ గణేష్ మండపం దర్శనానికి వెళ్లారు. ఆ క్రమంలో రోడ్డుపై ఆగి ఉన్న అదే గ్రామానికి చెందిన ఖానాపూర్ మాజీ ఎంపీపీ భర్త గడ్డం రవీందర్ కారుకు జాన్సన్ నాయక్ కారును తగిలించించారని చిన్నపాటి గొడవ జరిగింది. అదే సమయంలో కొందరు యువకులు అక్కడికి వెళ్లి మందపెల్లి, రాజూరా రోడ్డు గురించి అడిగేందుకు గుమిగూడారు. తమ గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయకున్నా రోడ్డు పనులు చేసినట్టుగా తప్పుడు ప్రచారం చేయడమేమిటని పలువురు జాన్సన్ నాయక్‌ను నిలదీశారు. దీంతో జాన్సన్ అనుచరులు, అక్కడున్న గ్రామస్తులకు మధ్య గొడవ మొదలైంది. అక్కడికి చేరుకున్న పోలీసులు ఇరువురికి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. సద్దుమణిగిన క్రమంలో అక్కడికి చేరుకున్న సీఐ మోహన్ మాజీ ఎంపీపీ భర్త గడ్డం రవిపై చేయి చేసుకోవడం ఉద్రిక్తతకు దారితీసింది. ఇరువురి మధ్య తోపులాట జరిగి లాఠీచార్జికి దారి తీసింది. గడ్డం రవీందర్‌ను పోలీసు వాహనంలో కడెం స్టేషన్‌కు తరలించారు. దీంతో కోపోద్రేక్తులైన గ్రామస్తులు ఖానాపూర్ చేరుకొని పోలీసు స్టేషన్‌లో గలాట సృష్టించారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు రమేష్ రాథోడ్ అక్కడికి చేరుకొని గ్రామస్తులకు సర్దిచెప్పారు. కడెం పోలీస్‌స్టేషన్‌లో ఉన్న రవీందర్‌ను తీసుకొచ్చి ఇంటికి పంపించారు. పోలీసులు కేవలం బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్ నాయక్ కోసమే కాకుండా ప్రజలకోసం పని చేయాలని ఈ సందర్భంగా మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ అన్నారు. జాన్సన్ నాయక్ గ్రామాల్లో అనవసరంగా యువతను రెచ్చగొట్టడం మంచిది కాదని మండిపడ్డారు. రెండ్రోజుల క్రితం సోమార్‌పేట్ గ్రామంలో ఓ యువకునిపై కూడా జాన్సన్ తన అనుచరులతో ఇలానే దాడి చేయించారని ఆరోపించారు. పోలీసు అధికారులు తమ గౌరవం తగ్గించుకునే చర్యలకు పాల్పడటం మంచిది కాదన్నారు.





ఆవుకు వినతిపత్రంతో అంగన్వాడీల నిరసన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

డిమాండ్లు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీలు చేస్తున్న సమ్మెలో భాగంగా శనివారం ఆవుకు వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి తప్పుడు ప్రకటనలు చేస్తున్నారన్నారు. శుక్రవారం మంత్రి చేసిన వ్యాఖ్యలు అర్థరహితమైనవన్నారు. ఆగస్టు 18న జరిగిన చర్చల్లో మంత్రి సమస్యల పరిష్కారం కోసం హామీ ఇచ్చారని, దానికి భిన్నంగా ఆగస్టు 25న అంగన్వాడీలను మోసం చేసే విధంగా జీవో జారీ చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా పశ్చిమబెంగాల్, కేరళ రాష్ట్రాలతో పాటు అనేక రాష్ట్రాలు అంగన్వాడీల డిమాండ్లు పరిష్కరించాయని గుర్తు చేశారు. అంగన్వాడీల సర్వీసును రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో మంత్రి ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు ఉద్యమం ఆపేది లేదని, భవిష్యత్తులో మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకులు వనిత, అంజలి, పద్మ ధనలక్ష్మి, సరోజ, విజయలక్ష్మి, స్వాతి, రాజమణి, రాజమ్మ, నాగలక్ష్మి, బతుకమ్మ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: అంగన్‌వాడీ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న సమ్మె శనివారం నాటికి 13వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సీఎం డౌన్ డౌన్, మంత్రి సత్యవతి రాథోడ్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. 13 రోజులుగా అంగన్‌వాడీలు న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేస్తుంటే ప్రభుత్వం స్పందించకపోవడం జేఏసీ నాయకత్వంతో చర్చలు జరపకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించాలన్నారు. అప్పటి వరకు తమ సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

బేల: మండలంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. శనివారం 13 రోజుకు చేరుకోగా చెవిలో పువ్వులు పెట్టుకొని ప్రభుత్వ వైఖరిని ఎండగట్టుతూ నినాదాలు చేశ్యారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు విశాఖ, సునీత, అనిత పాల్గొన్నారు.

జన్నారం : అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా 13వ రోజు కాంగ్రెస్, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మద్దతు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా అంగన్‌వాడీల సేవలు గుర్తించి వారి డిమాండ్లు పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముజఫర్ అలీ ఖాన్, సయ్యద్ ఫసివుల్లా, జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యం రాజన్న, ఎంపీటీసీ మచ్చ శంకరయ్య, సీనియర్ నాయకులు డి. లక్ష్మీనారాయణ, మైనారిటీ సెల్ అధ్యక్షులు వసీం పటేల్, కార్యదర్శి లకావత్ తిరుపతి, గాబ్రియల్, యువజన కాంగ్రెస్ నాయకులు రేగుంట ప్రదీప్, మంద రాజేష్, దుర్గం రవిశశి, కోవ శాంతయ్య, రమేష్, మహేష్, సిఐటియు మండల అధ్యక్షుడు కూకటికారి బుచ్చయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కనికరం అశోక్ పాల్గొన్నారు.





ఆదిలాబాద్‌టౌన్ :



జన్నారం :

మాదకద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రానున్న అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలని, జిల్లాలో మాదకద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఇంటెలిజెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రానున్న అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధం కావాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలన్నారు. అక్కడ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. డబ్బు, మద్యం, ఇతర మాదకద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు రెవెన్యూ, పోలీస్, కమర్షియల్, ఇన్‌కం టాక్స్, ఎక్సైజ్ శాఖల అధికారులు సమన్వయంతో పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 7 సరిహద్దు చెక్ పోస్టులను ఏర్పాటు చేయడం జరిగిందని, వాటిని సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రైల్వే, ఆర్టీసీ బస్ స్టేషన్లు, కార్గో కేంద్రాలలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తరువాత నిబంధనల మేరకు డబ్బు తరలించే ముందు సరియైన పత్రాలు, వాహనాలకు అనుమతులు ఉండాలని తెలిపారు. ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. మ్యాన్ పవర్, వెహికల్స్, మెటీరియల్, తదితర సౌకర్యాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎస్పీ డి. ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా సరిహద్దులలో చెక్ పోస్టుల నిర్వహణ, సీసీ కెమెరాల ఏర్పాటు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలకు అవసరమైన పోలీసు సిబ్బందిని నియమిస్తున్నామన్నారు. అనంతరం స్థానిక టీటీడీసీలోని డిస్ట్రిబ్యూషన్ జరిగే ప్రదేశం, పార్కింగ్ స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామల దేవి, జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్, ఆర్డీఓ స్రవంతి, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియా, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



టీచర్ పోస్టులను వ్యతిరేకిస్తూ డీఎస్సీ అభ్యర్థుల దీక్ష

- మద్దతు తెలిపిన పీడీఎస్‌యూ



నవ తెలంగాణ-నిర్మల్

విద్యాశాఖ మంత్రి ప్రకటించిన టీచర్ పోస్టులను వ్యతిరేకిస్తూ డీఎస్సీ అభ్యర్థులు ఒక్కరోజు నిరసన దీక్షను చేపట్టారు. శనివారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట దీక్ష చేపట్టి ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. వీరి దీక్షకు పీడీఎస్‌యూ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వాగ్మారే మహేందర్ మాట్లాడుతూ పోరాడి సాధించిన తెలంగాణలో ఉపాధ్యాయ కొలువుల కోసం యువత, నిరుద్యోగులు పోరాడాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. 2017లో 16,000 వేల విద్యావాలంటీర్లను ప్రభుత్వం భర్తీ చేస్తే ఈ ఆరు సంవత్సరాలలో రిటైర్ అయిన ఉపాధ్యాయ పోస్టుల్లో ఖాళీలు పెరిగాయన్నారు. ప్రస్తుతం 24వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అయితే విద్యాశాఖ కేవలం 6,612 టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. అవసరమున్న వాటిలో 25 శాతం ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయడంతో నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఇది కేవలం ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నోటిఫికేషన్ ఇచ్చారని ఆరోపించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నోటిఫికేషన్‌ను రద్దు చేసి 24వేల పోస్టులకు కొత్తగా నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.నవీన్, జిల్లా నాయకులు రాజారాం, గంగరాజు, డీఎస్సీ అభ్యర్థులు తిరుమలేశ్, సురేష్, లావణ్య లక్ష్మీ, మౌనిక పాల్గొన్నారు.

వేజ్‌బోర్డు ఏరియర్స్‌లో ఆదాయ పన్ను అధికం

- ఇందారం-1ఏ మ్యాన్ రైడింగ్ సమస్యను పరిష్కరించాలి
- ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య



నవతెలంగాణ-జైపూర్

23 నెలల వేజ్‌బోర్డు ఏరియర్స్‌లో ఆదాయపు పన్ను అధికంగా చెల్లించి రావడం కార్మికులను నిరాశకు గురి చేసిందని ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన క్యాదర్శి వీరభద్రయ్య ఆవేదన వ్యక్తం చేశారు. పిట్ కార్యదర్శి నవీన్‌రెడ్డి అధ్యక్షతన శనివారం గని ఆవరణలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. అధికంగా చెల్లించాల్సి వచ్చిన ఆదాయపు పన్ను విధింపుల్లో కార్మికుల్లో అనుమానాలు తలెత్తుతున్నందున చెల్లింపుల జాబితాను తెలుగు ప్రింటు కార్మికులకు అందించాలని డిమాండ్ చేశారు. ఇందారం-1ఏ గని కార్మికులు ఎదుర్కొంటున్న మ్యాన్ రైడింగ్ సమస్య పట్ల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కార్మికుల సౌకర్యార్థం సమయానుగుణంగా మ్యాన్‌రైడింగ్ నడిపించే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. దూర ప్రాంతాల నుండి డ్యూటీ చేస్తున్న కార్మికులు విధులు పూర్తి చేసి ఇల్లు చేరేందుకు చీకటి పడుతుందున మధ్యాహ్నం 1.30గంటలకు మ్యాన్ రైడింగ్ నడిపించే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇందారం గనిలో పని చేస్తున్న 1200 మంది కార్మికుల్లో 500 మంది కార్మికులు జనరల్ షిఫ్టులో పని చేస్తున్నందున మ్యాన్ రైడింగ్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు గని కార్మికులతో కలిసి మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ కోశాధికారి నాగభూషణం, కాంట్రాక్టు కార్మికుల సంఘం బెల్లంపల్లి రీజియన్ ప్రధాన కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, నాయకులు అరికె రాజయ్య, జుట్టు రాములు, నవీన్, అజయ్, శేఖర్, మహేష్, యూసూఫ్, సంజీవ్ పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే రాష్ట్రాభివృద్ధి



నవతెలంగాణ-తలమడుగు

ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. ముందుగా మండలంలోని పల్లి(బి)లోని వినాయకుడి వద్ద పూజలు చేశారు. అనంతరం మద్నాపూర్ గ్రామంలో పర్యటించి ప్రజలతో మాట్లాడి ప్రభుత్వ పథకాలను వివరించారు. అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. తమ ఇంటి బిడ్డగా ఈసారి జరిగే ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని, తనను ఆశీర్వాదించాలని అభ్యర్థించారు. ఆయన సమక్షంలో పలువురు యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ కేరాం దేవురావ్, కేదారేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వసంత్‌రెడ్డి, తలమడుగు సర్పంచ్ కళ్లెం కరుణాకర్‌రెడ్డి. పీఏసీఎస్ చైర్మెన్ శ్రీనివాస్‌రెడ్డి, ఆసం రవి, అభిరామ్‌రెడ్డి, మేస్రం దేవన్న, భీంరావ్, మేస్రం దేవ్‌రావ్, మేస్రం మోతిరాం, మేస్రం భీమ్‌రావ్, అవినాష్ పాల్గొన్నారు.

హరీశ్వర్‌రెడ్డి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసిన మంత్రి

నవతెలంగాణ-నిర్మల్

మాజీ ఉప సభాపతి, పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల హరీశ్వర్‌రెడ్డి మృతి పట్ల రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి శనివారం తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సుదీర్ఘ ప్రజా ప్రస్థానంలో ఆయన తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పాటు చేసుకున్నారని కొనియాడారు. కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని పేర్కొన్నారు.